
Follow: @ANNTELUGU
ANN తెలుగు
27-06-2025
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 204 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## ఇజ్రాయెల్‌పై విజయం మాదే..

- అమెరికాను చాచి చెంపదెబ్బ కొట్టాం
- ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

03

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బిగ్ రిలీఫ్

- పెండింగ్‌లో ఉన్న 180.38 కోట్ల మెడికల్ రీయింబర్స్మెంట్ క్లియర్
- 26,519 మందికి ఊరట
- గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులు సైతం క్లియర్

03

## బైక్‌లకు టోల్ ఫీజు వసూలుపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

- జులై 15 నుండి అమలంటూ ప్రచారం

03



# బోనమెత్తిన గోల్కొండ
## భాగ్యనగరంలో వైభవంగా బోనాలు
అమ్మవారికి బోనం సమర్పించిన జోగినీలు
ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు
డప్పు చప్పులతో కోటలో సందడి వాతావరణం
పట్టువస్త్రాలు సమర్పించి తొలిబోనాలు ఎత్తిన స్పీకర్, మంత్రులు

వివరాలు 2లో



## ఈ మూడేళ్లు రేవంత్ రెడ్డే సీఎం
- ఆ తర్వాత మరో 5 ఏళ్లు ఆయనే ఉంటడట
- 9 ఏళ్ల తర్వాత నేను సీఎం కావాలనుకుంటున్నా
- బీఆర్ఎస్ పార్టీకి ఇక ఆ అవకాశం లేదు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో



## హెబ్బా పటేల్ ఫోన్ ట్యాప్ చేయడానికి ఆమె లేడీ నక్సలా?
ఫోన్ ట్యాపింగ్ పై బిజెపి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

వివరాలు 2లో




# డ్రగ్స్, గంజాయి అమ్మితే వెన్నువిరిచేస్తాం



## ఎక్కడ గంజాయి పండించినా ఈగల్ కనిపెడుతుంది
డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి
హీరోల సినిమా లైఫ్‌ని కాదు.. రియల్ లైఫ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి
రామ్ చరణ్.. విజయ్ దేవరకొండ కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి
ఈగల్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

“ హీరోలు సినిమా పాత్రలనే కాదు.. నిజజీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మెగాస్టార్ చిరంజీవి డ్రగ్స్ జోలికి వెళ్లలేదని చెప్పారు. హీరోలు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ ఇంత పెద్ద సాయికి ఎదిగారంటే వాళ్లు డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉండటమే కారణమని ఉద్ఘాటించారు. హీరో విజయ దేవరకొండ కూడా నల్లమల అడవి నుంచే వచ్చారని గుర్తుచేశారు. - మహా, హైదరాబాద్

వివరాలు 2లో

## రైజింగ్ తెలంగాణ స్ఫూర్తినిస్తోంది
డ్రగ్స్‌పై ప్రభుత్వ చర్యలు బేష్: రామ్ చరణ్ 02

# ట్యాపింగ్ ఫైల్స్
## ఎంపీ కొండాకు సిట్ పిలుపు
### మంత్రి పొంగులేటికి సిట్ నుండి ఫోన్
మంత్రి కుటుంబంతో పాటు అనుచరుల ఫోన్లు ట్యాప్ చేశారని వెల్లడి
త్వరలో సిట్ ముందుకు మంత్రి.. విపక్షమే కాదు.. స్వపక్షాన్నీ టార్గెట్ చేశారు
నా ఫోన్ కూడా ట్యాప్ మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, మహా:** ట్యాపింగ్ ఫైల్స్ పై విచారణ ముమ్మరమైంది. బీఆర్ఎస్ హయాంలో అనుమానం ఉన్న వారందరినీ టార్గెట్ చేసి సంభాషణలు వినగా, ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీలో ఉంటూ పక్క పార్టీలో చేరతారనే అనుమానం ఉన్న నాయకులపైనే నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. అదే సమయంలో ప్రత్యర్థులతో పాటు వారితో సన్నిహితంగా ఉండే వారందరి ఫోన్లు ట్యాప్ చేయడం ద్వారా

మిగతా 2లో

## కేసీఆర్ పై క్రిమినల్ కేసు పెట్టాలి
- అమర్ సింగ్ ఫోన్ ట్యాపింగ్ పై సుప్రీం తీర్పు ఉంది
- మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్

3లో

### రాజ్యాంగాన్ని చెరబట్టిన కాంగ్రెస్ నేడు అది
# పట్టుకుని తిరుగుతోంది
“ఎంఎల్ఏల ఇంటికి ఇండ్లు – పేదల కోసం మాత్రం హామీలే”
“బీసీ, ఎస్టీ సీఎంలు లేని కాంగ్రెస్ పార్టీకి సమాధానం చెప్పే ధైర్యం ఉందా?”
“ఒక్క బీజేపీ మాత్రమే దేశాన్ని సంరక్షించగలదు”
మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

**ఖమ్మం,మహా:** "చరిత్ర లేకుండా వర్తమానం ఉండదు. వర్తమానం లేకుండా భవిష్యత్తు ఉండదు" అని పదునైన పదాలతో కాంగ్రెస్ పార్టీని విమర్శించిన మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ నాయకుడు శ్రీ ఈటెల రాజేందర్ ఖమ్మం లో జరిగిన 'సంవిధాన్ హత్య దినం' కార్యక్రమంలో తన ప్రసంగం ద్వారా సెంటర్ ఆఫ్ గ్రావిటీగా నిలిచారు. ఖమ్మం వీడియోస్ కాలనీలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో నిర్వహించిన ఈ మీడియా సమావేశంలో, ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ స్పందనకు దారి తీస్తున్నాయి.

మిగతా 2లో





## ఆదిలాబాద్‌లో కదం తొక్కిన కాంగ్రెస్
మంత్రులు జూపల్లి, వివేక్‌లకు ఘనస్వాగతం
కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

వివరాలు 3లో

# బిర్యానీ పంచాయితీ!
## ఆంధ్రోళ్ల బిర్యానీ అంటూ కవిత సెటైర్లు
- మనమేం తింటం.. ఎలా ఉంటదో
- కేసీఆర్ సార్ చెప్పిండు కదా అని వ్యాఖ్య
- సోషల్ మీడియాలో ఎమ్మెల్సీపై తీవ్ర విమర్శలు
- ఆమె చీప్ ట్రిక్స్ కొత్తేమీ కాదని ఓ నెటిజన్ పోస్ట్
- రాజకీయాలు మానేసి.. బిర్యానీ రివ్యూలు ఇస్తున్నారంటూ బీజేపీ లీడర్ విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్

3లో






# డ్రగ్స్, గంజాయి అమ్మితే వెన్నువిరిచేస్తాం



## ఎక్కడ గంజాయి పండించినా ఈగల్ కనిపెడుతుంది

డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి

హీరోల సినిమా లైఫ్‌ని కాదు.. రియల్ లైఫ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి

రామ్ చరణ్.. విజయ్ దేవరకొండ కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఈగల్ ఆవిష్కరణలో సీఎం రేవంత్‌రెడ్డి

**హీరోలు సినిమా పాత్రలనే కాదు.. నిజజీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మెగాస్టార్ చిరంజీవి డ్రగ్స్ జోలికి వెళ్లలేదని చెప్పారు. హీరోలు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ ఇంత పెద్ద సాయికి ఎదిగారంటే వాళ్లు డ్రగ్స్ జోలికి వెళ్లకుండా ఉండటమే కారణమని ఉద్ఘాటించారు. హీరో విజయ దేవరకొండ కూడా నల్లమల అడవి నుంచే వచ్చారని గుర్తుచేశారు. - మహా, హైదరాబాద్**

ఎక్కడ గంజాయి పండించినా ఈగల్ కనిపెడుతుందని అన్నారు. ఈరోజు నుంచి తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోని ఈగల్(ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్)గా నామకరణం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా ఈగల్ లోగోను సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. డ్రగ్స్ నియంత్రణ కోసం ఈగల్ వ్యవస్థని ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్, గంజాయి అమ్మితే వెన్నువిరిచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ప్రపంచ యాంటీ నార్కోటిక్స్ డే సందర్భంగా గురువారం శిల్పా కళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి, సినీ హీరోలు రామ్‌చరణ్, విజయ దేవరకొండ, రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరయ్యారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ , ఇతర భాగస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తూ పలు స్టాల్స్, బ్లడ్ డొనేషన్ ఏర్పాటు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా వారం రోజుల పాటు డ్రగ్స్ నివారణపై అవగాహన సదస్సులు జరుగనున్నాయి. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలని కోరుకున్నారు. తెలంగాణ అంటే ఐటీ, ఫార్మా రంగాలకు ప్రాచుర్యం పొందిందని తెలిపారు. ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ డ్రగ్స్ హబ్‌గా మారొద్దని చెప్పారు. ప్రపంచంతో పోటీపడే శక్తి తెలంగాణకు ఉందని ఉద్ఘాటించారు. మనం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తీరని నష్టం జరుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు

**కన్యూమర్లను డీ అడిక్షన్ సెంటర్లకు తరలిస్తాం: సందీప్ శాండిల్య**

ఒక్క గోవాలోనే ఒక్కో హవాలా ఆపరేటర్ 2 రోజుల్లో రూ.50 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ని అమ్ముతున్నారని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకున్నా సరే చట్టరీత్యా నేరమేనని హెచ్చరించారు. గతంలో డ్రగ్స్ కన్స్యూమర్లకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపే వాళ్లమని, కానీ ఇప్పుడు ఈ పాలసీలో మార్పులు తెస్తున్నామని అన్నారు. డ్రగ్స్ తీసుకుంటే కస్టడీకి తీసుకుని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరుస్తామని తెలిపారు. కన్స్యూమర్లను డీ అడిక్షన్ సెంటర్లకు తరలిస్తామని సందీప్ శాండిల్య పేర్కొన్నారు.

**డ్రగ్స్ కి దూరంగా ఉండాలి: పుల్లెల గోపీచంద్**

డ్రగ్స్, స్మోకింగ్ చాలా సంతోషం ఇస్తాయని కొంతమంది అనుకుంటారని.. కానీ అదంతా భ్రమే అని జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ తెలిపారు. ఒక్కసారే అని చెప్పి డ్రగ్స్‌ని అలవాటుగా చేసుకోని జీవితాలను కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని పుల్లెల గోపీచంద్ సూచించారు.

### డ్రగ్స్ ను ఉక్కుపాదంతో అణిచివేస్తాం..

'తెలంగాణ ప్రాంతానికి గొప్ప చరిత్ర ఉంది. పోరాట స్ఫూర్తి నుంచి వచ్చిన ఉద్యమమే తెలంగాణ ఉద్యమం. ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లాల్సిన తెలంగాణ రాష్ట్రానికి డ్రగ్స్ ఆటంకంగా ఉంది. నేను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రోజే రాష్ట్రంలో డ్రగ్స్‌ను ఉక్కుపాదంతో అణిచివేస్తానని చెప్పా.. అలాగే చేస్తున్నాను. అత్యధిక యువత ఉన్న మన దేశం ఒలింపిక్స్‌లో రాణించకపోతుంది. 68శాతంతో ప్రపంచంలో అత్యధికంగా యువత ఉన్న దేశం మన భారతదేశం. యువత గంజాయికి బానిస అయితే దేశం మనుగడ సాధించగలదా..? దేశానికి హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు ఉక్కు కవచంగా ఉండాల్సింది పోయి.. ఆ రాష్ట్రాల్లోని యువత అంతా డ్రగ్స్‌కి బానిసలు అయ్యారు. యువతకు స్ఫూర్తిని, ఆదర్శంగా నిలవడానికి ఈరోజు ఈ కార్యక్రమానికి వచ్చాను. యువతను సరైన మార్గంలో పెట్టాలి. వారికి సరైన అవకాశాలు కల్పించాలని స్పోర్ట్స్ పాలసీని, స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చాం. డిమాండ్ అండ్ సప్లైలో ఉన్న గ్యాప్‌ని నింపడానికి స్కిల్ యూనివర్సిటీని తీసుకువచ్చాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు.

### స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ..

'చాలా చిన్న దేశమైన సౌత్ కొరియాలోని ఒక్క అమ్మాయి మూడు మెడల్స్ సాధిస్తే, 140 కోట్ల జనాభా ఉన్న మనం ఒక్కటి కూడా సాధించలేదు. వేరే దేశాల నుంచి నాణ్యమైన కోచ్‌లను హైదరాబాద్‌కు తీసుకువచ్చి, ఒక స్పోర్ట్స్ హబ్‌గా మన రాష్ట్రాన్ని తీర్చిదిద్దబోతున్నాం. 2047 వరకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి మన రాష్ట్రాన్ని తీసుకెళ్లాలి. నేను కూడా జెడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానంటే నా కమిట్‌మెంటే కారణం. స్కూలు, కాలేజ్ యాజమాన్యాలు కూడా డ్రగ్స్ నిషేధం కోసం బాధ్యత తీసుకోవాలి. విద్యార్థుల చెడు ప్రవర్తనను మార్చేందుకు మంచి సైకాలాజికల్ టీచర్స్‌ని నియమించుకోండి. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా డ్రగ్స్‌పైన అవగాహన కల్పించాలని కలెక్టర్లకు, రాష్ట్ర సీఎస్‌కు ఆదేశిస్తున్నాను. పాఠశాల పరిసరాల్లో డ్రగ్స్ ఐస్‌క్రీమ్, డ్రగ్స్ చాక్లెట్లు అమ్మితే మాకు సమాచారం ఇవ్వండి. మీరు, మేము కలిస్తేనే ఆరోగ్య తెలంగాణను సాధిస్తాం. ముంబై , ఢిల్లీతో కాదు మనం న్యూయార్క్‌తో పోటీపడాలి. నిఖత్ జరీన్ , మహమ్మద్ సిరాజ్ లాంటి క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# రైజింగ్ తెలంగాణ స్ఫూర్తినిస్తోంది

## డ్రగ్స్ పై ప్రభుత్వచర్యలు బేష్ : రామ్ చరణ్




**హైదరాబాద్, మహా** రైజింగ్ తెలంగాణ స్ఫూర్తిస్తోందని.. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ ప్రభుత్వ చర్యలు బాగున్నాయని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అన్నారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రైజింగ్ తెలంగాణ స్ఫూర్తిస్తోందని.. డ్రగ్స్ నిర్మలనలో తెలంగాణ ప్రభుత్వ చర్యలు బాగున్నాయని అన్నారు. కొన్ని సంవత్సరాల క్రితం స్కూల్స్ బయట డ్రగ్స్ అమ్ముతున్నారని విన్నానని.. 2014లో 3, 4 క్లాస్ చదివే పిల్లలకు ఐస్ క్రీంలలో డ్రగ్స్ ఇచ్చారని తెలిసి పేరెంట్స్ ధర్నాలు చేసిన విషయాన్ని గుర్తు చేసిన రామ్ చరణ్.. డ్రగ్స్ అంత డీప్ గా వెళ్లిపోయాయని అన్నారు. ఫిజికల్ వర్క్ అవుట్ , ఒక షూటింగ్, కుటుంబం తో క్వాలిటీ టైమ్, స్పోర్ట్స్.. ఒక రోజు కి ఇది చాలని అన్నారు. పిల్లలని స్కూల్స్ కు పంపాలంటే భయమేసే పరిస్థితులు ఉండకూడదని.. డ్రగ్స్ నిర్మూలన కు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు చాలా బావున్నాయని అన్నారు.ప్రభుత్వానికి ఇలాంటి మంచి కార్యక్రమంలో తమ తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని రామ్ చరణ్ అన్నారు. కుటుంబం తో గడపాలని.. హెల్త్ ను ఫిట్ గా ఉంచుకుంటూ మన కుటుంబాన్ని రక్షించుకోవాలని అన్నారు. మన సమాజాన్ని కాంపడల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామ్ చరణ్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి, పోలీస్ డిపార్ట్ మెంట్ కి కృతజ్ఞతలు తెలిపారు . ప్రతి ఒక్కరు సోల్జర్ గా మారి డ్రగ్స్ నిర్మలన కోసం పోరాడాలని అన్నారు.

రాజ్యాంగాన్ని చెరబట్టిన కాంగ్రెస్ నేడు అది

# పట్టుకుని తిరుగుతోంది

(మొదటిపేజీ తరువాయి)



ఈటెల రాజేందర్ మాట్లాడుతూ - "197577 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యాన్ని చంపేసిన చీకటి అధ్యాయంగా చరిత్రలో నిలిచిపోయింది. నేడు అదే పార్టీ రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతూ దానిపై ప్రేమనటిస్తోంది. కానీ ప్రజాస్వామ్యాన్ని తొక్కినది వారే, అంబేద్కర్ గారిని అవమానించినది వారే" అన్నారు. కాంగ్రెస్ పాలనలో పత్రికా స్వేచ్ఛ ఖూనీ చేయబడిందని, అభిప్రాయ స్వేచ్ఛ కొట్టేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అంబేద్కర్ గారిని కాంగ్రెస్ మంత్రివర్గం నుండి తొలగించిందంటే ఆ పార్టీ రాజ్యాంగాన్ని ఎట్లా గౌరవిస్తుందని చెప్పగలదు? ఆయనను ఎన్నికల్లో ఓడించిన నాయకుడు నెహ్రూనే" అని అన్నారు. ఆ పార్టీ రాజ్యాంగ బద్ధత పట్ల ఉండే అబద్ధపు ప్రేమను ఈటెల ఆవిష్కరించారు. రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగిన ఈటెల గారు - "రాహుల్ గాంధీ మాటలు ఒకలా, చర్యలు మరోలా ఉంటాయి. బీసీ, ఎస్టీ ముఖ్యమంత్రుల గురించి మాటలు చెబుతారు, కానీ ఆ వర్గాలకు ఒక్కరినీ ముఖ్యమంత్రిగా చేసే దమ్మూ లేదు. కాంగ్రెస్ గెలవడానికి వాగ్దానాలు చేస్తుంది. అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోతుంది" అన్నారు. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 66 హామీలు ఎటెన్నయ్యాయంటూ ప్రజలకు వేడుకల నెపంతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ''పేదల బలిపశువుల్లా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం మాట్లాడుతుంది గానీ, అభివృద్ధి గురించి ఆలోచించదు'' అన్నారు. భారతీయ జనతా పార్టీ మాత్రం నిజమైన ప్రజాస్వామిక ధ్యేయాలతో ముందుకెళ్తోందని, దేశానికి మొట్టమొదటి ఓబీసీ ప్రధానమంత్రిని ఇచ్చింది. ఆ తర్వాత దళితుడైన కోవింద్ ని రాష్ట్రపతిగా నియమించింది. ఇప్పుడు ఆదివాసీ బిడ్డ అయిన ద్రౌపది ముర్ము గారిని రాష్ట్రపతిగా చేసింది. ఈ ముగ్గురు నాయకులు నరేంద్ర మోదీ గారి ప్రజా సంకల్పానికి నిదర్శనమని తెలిపారు. ఇంటిగలల పథకాలపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. "కేంద్రం 3 లక్షల ఇండ్లకు నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర ఇండ్లు కూడా కట్టలేదు. ఖచ్చితంగా పేదలకు ఇవ్వాల్సిన ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించారు. ఇది వారిదేం జాగీరు కాదు" అని హెచ్చరించారు. మీడియా సమస్యలపై దృష్టి: ఈటెల విలేకరుల సమస్యలను ప్రస్తావిస్తూ - "ఖమ్మం జర్నలిస్టులకు ఆనాటి ప్రభుత్వం 23 ఎకరాల స్థలం కేటాయించినా అమలు కాలేదు. ఇప్పటికైనా జర్నలిస్టులకు 100-120 గజాల స్థలంలో ఇండ్ల స్థలాలు ఇవ్వాలి. ఇది వారి ప్రాధాన్యత గల హక్కు" అని అన్నారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్,నాయకులు తాండ వినోద్ రావు, నున్నా రవి కుమార్,దేవకీ వాసుదేవరావు, గోంగూర వెంకటేశ్వర్లు, సన్నీ ఉదయ ప్రతాప్, ఇవి రమేష్,పుల్లారావు యాదవ్, గెంటేల విద్యాసాగర్,దొంగలు సత్యనారాయణ , విజయరాజు,శ్యామ్ రాథోడ్, తడుపునూరి రవీందర్, నెల్లూరు బెనర్జీ, సుదర్శన్ మిశ్రా, తదితరులు పాల్గొన్నారు.

# ట్యాపింగ్ ఫైల్స్

## ఎంపీ కొండాకు సిట్ పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల్లో విజయం సాధించాలని రిటైర్డ్ అధికారి ప్రభాకర్ రావు కు ఎస్ ఐబి చీఫ్ బాధ్యతలు అప్పగించి పెద్ద నెట్ వర్క్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీకి దూరంగా ఉంటూ వస్తున్న ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ జరిగినట్టు తెలుస్తోంది. ఆయన కుటుంబ సభ్యుల ఫోన్లను , ఆయన సన్నిహితుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారు. గురువారం సిట్ అధికారులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కాల్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మీ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, విచారణకు రావాలని కోరారు. బీఆర్ఎస్ వీడిన మరో నేత చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. విచారణకు రావాలని కోరింది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ స్టేట్ చీఫ్ గా ఉన్న ప్రస్తుత కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ కూడా ట్యాపింగ్ అయ్యింది. ఆయన పాదయాత్ర, రూట్ మ్యాప్, గ్రూప్-1 లీకేజీపై ఆయన చేసిన పోరాటం, టెన్త్ క్లాస్ క్వశ్చన పేపర్ లీకేజీ పై పోరాటం ఇవన్నీ ఫోన్ ట్యాపింగ్ ద్వారానే తెలుసుకున్నారని బండి సంజయ్ కుమార్ ఆరోపిస్తున్నారు. ఆయన కూడా వచ్చి వాంగ్మూళం ఇవ్వాలని సిట్ కోరింది.

**కాదెవరూ అనర్హం**

స్టేషన్ ఘన్ పూర్ టికెట్ కోసం తాటికొండ రాజయ్య తీవ్రంగా ప్రయత్నించారు. చివరకు ఆ టికెట్ కడియం శ్రీహరికి ఇచ్చారు. ఆ తర్వాత రాజయ్య కాంగ్రెస్ లో చేరబోతున్నారనే చర్చ జరిగింది. ఈ క్రమంలో ఆయన కదలికలను గమనించేందుకు ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు ఆరోపణలున్నాయి. ఫోన్ సంభాషణలు, కదలికల ఆధారంగా ఆయనను పిలిపించుకొని మాట్లాడినట్టు తెలుస్తోంది. అలాగే మెదక్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చవి చూసిన పద్మాదేవేందర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కూడా జరిగింది. అప్పట్లో మల్కాజ్ గిరి ఎమ్మెల్యేగా ఉన్న మైనంపల్లి హన్మంతరావు తనతోపాటు తన కుమారుడు రోహిత్ కు మెదక్ టికెట్ అడిగారు. బీఆర్ఎస్ నాయకత్వంపై ఒత్తిడి పెట్టారు. దీనికి నిరాకరించడంతో ఆయన పార్టీ మారి కాంగ్రెస్ జాయిన్ అయ్యారు. ఈ క్రమంలో ఆయన కదలికలను గమనించేందుకు ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలున్నాయి. వైఎస్సార్ తెలంగాణ పార్టీ ఏర్పాటు చేసి కార్యక్రమాలను విస్తృతం చేసిన ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఫోన్ కూడా ట్యాపింగ్ అయ్యింది. ఆమె కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో ఎక్కడికక్కడ చెక్ పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్టు సమాచారం. 2023 ఎన్నికల్లో గట్టెక్కేందుకు అన్ని ప్రయత్నాలనూ గత ప్రభుత్వం చేసింది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫోన్ తో పాటు కీలక నేతలు ఫహీం ఖురేష్, అనిల్ యాదవ్, ఎన్నికల స్ట్రాటజిస్ట్ సైదులు వంటి వారి ఫోన్లు కూడా ట్యాప్ అయ్యాయి. తన ఫోన్ కూడా ట్యాప్ చేశారని మంత్రి వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు.



హెబ్బా పటేల్ ఫోన్ ట్యాప్ చేయడానికి

## ఆమె లేడీ నక్సలా?

**ఫోన్ ట్యాపింగ్ పై బిజెపి ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు**

**మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేళ బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రకుల్, హెబ్బా పటేల్ ఫోన్లు ట్యాప్ చేయడానికి.. వాళ్లు ఏమైనా లేడీ నక్సల్సా అని ప్రశ్నించారు. భార్యాభర్తల ఫోన్ కాల్స్ వినడం, ఇతరుల కన్వర్జేషన్స్ ఎంజాయ్ చేయడం ఎంత వరకు కరెక్ట్ అని.. వీళ్లను తిట్టాలంటే ప్రజాస్వామ్య భాష సరిపోదన్నారు. యూనిఫామ్‌కు వాల్యూ ఇవ్వకుండా పోలీసులు చేసిన ఈ పనికి ఏం చేయాలన్న ఆయన.. రేవంత్ ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు ఇది ఇలాగే కొనసాగుతుందని.. ఆ ఆడియోలు వింటూ ఎంజాయ్ చేయడం, బ్లాక్ మెయిల్ చేయడం, లోపాయకారి ఒప్పందాలు చేసుకోవడమే ఉంటుందని విమర్శించారు.

# బోనమెత్తిన గోల్కొండ

## భాగ్యనగరంలో వైభవంగా బోనాలు

- అమ్మవారికి బోనం సమర్పించిన జోగినీలు
- ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు
- డప్పు చప్పులతో కోటలో సందడి వాతావరణం
- పట్టువస్త్రాలు సమర్పించి తొలిబోనాలు ఎత్తిన స్పీకర్, మంత్రులు



**హైదరాబాద్, మహా :** భాగ్య నగరంలో ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మా.. సల్లంగ చూడు అని వేడుకుంటూ బోనాల సంబురానికి ఆడపడుచులు గురువారం శ్రీకారం చుట్టారు. ఆషాఢ మాసంలో తొలి గురువారం గానీ, ఆదివారం గానీ బోనాల సందడి ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ఆషాఢం మాసం గురువారం రావడంతో బోనాల పండగ ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం గోల్కొండ జగదాంబిక ఆలయం నుంచి బోనాల సంబురాలకు భక్తులు శ్రీకారం చుట్టారు. దీంతో గొల్కొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడుతోంది.

**బారులు తీరిన భక్తులు..**

గోల్కొండ, లంగర్ హౌజ్ చౌరస్తా వద్ద జగదాంబ మహంకాళికి బోనలు సమర్పించడం కోసం భక్తులు బారులు తీరారు. బోనలు సమర్పించి మహిళలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి పంపించారు. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండడంతో భక్తులు కాస్తా ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

**పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు..**

ఆషాఢమాస బోనాల సంబురం సందర్భంగా లంగర్ హౌజ్ చౌరస్తాలో గోల్కొండ జగదాంబ మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరుపున స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, దేవదాయశాఖ మంత్రి కొండా సురేఖ, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు, తొలి బోనం సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులతోపాటు నృత్యం చేస్తూ వారిని పొన్నం ప్రభాకర్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన , సీపీ సీవీ ఆనంద్ ,కాంగ్రెస్ సీనియర్ నేత విహెచ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ కూడా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు..

**రూ. 20 కోట్ల నిధులు..**

అనంతరం మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఆషాడ మాసంలో హైదరాబాద్‌లోని సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న బోనాల సంబురాలకు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని అన్నారు. హైదరాబాద్ ప్రజలు వచ్చే భక్తులకు మంచి ఆతిధ్యం ఇచ్చేలా అంగరంగ వైభవంగా జరుపుకోవాలని సూచించారు. బోనాల పండుగ సందర్భంగా మూడు వేల దేవాలయాలకు పండుగ కోసం 20 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. నెల రోజుల పాటు వివిధ ఆలయాల్లో బోనాలు సమర్పిస్తూ రంగం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. జగదాంబ మహంకాళి అమ్మవారి ఆశీర్వాదంతో ఈ సంవత్సరం సంవృద్ధిగా వర్షాలతో పాడి పంటలతో అందరూ ఆరోగ్యాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకున్నట్లు మంత్రులు కొండా, పొన్నం తెలిపారు

**బోనాలు సమర్పించిన కవిత, ఈటల**

గోల్కొండలో ఉన్న జగదాంబిక అమ్మవారికి, అలాగే ఎల్లమ తల్లికి బోనాలను మహిళలు సమర్పించారు. అలాగే తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బోనం సమర్పించారు. అలాగే బీజేపీకి చెందిన మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజంద్ర కూడా అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యావత్ ప్రజానికానికి వారిద్దరు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి ప్రశాంతంగా జీవించే భాగ్యం కలగాలని, జాతరను అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఆయన కోరారు.



# ఆదిలాబాద్ లో కదం తొక్కిన కాంగ్రెస్

## మంత్రులు జూపల్లి, వివేక్ లకు ఘనస్వాగతం

### కంది శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ

**ఆదిలాబాద్, మహా:** మంత్రులుగా తొలిసారి ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలకు ఆదిలాబాద్ కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జ్ కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులకు భారీ గజమాలతో స్వాగతం పలికి.. శాలువాలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి వారితో కలిసి వందలాది బైక్ లతో భారీ ర్యాలీని ఆదిలాబాద్ పట్టణంలో నిర్వహించారు. కొమురంభీం చౌక్ లో భీం విగ్రహానికి మంత్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి గాంధీ పార్కుకు బయలుదేరి అక్కడి మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ చౌక్ కు వెళ్లి బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అధికారిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపురావు, ఆయా నియోజకవర్గాల ఇంఛార్జిలు శ్రీహరిరావు, ఆడే గజేందర్, శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు. మంత్రుల పర్యటనతో ఆదిలాబాద్ జిల్లాలో జోష్ రాగా, ఉమ్మడి జిల్లా ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. పలు ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు బిగ్ రిలీఫ్

- పెండింగ్ లో ఉన్న 180.38 కోట్ల మెడికల్ రీయింబర్స్మెంట్ క్లియర్
- 26,519 మందికి ఊరట
- గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులు సైతం క్లియర్

**హైదరాబాద్, మహా:** ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన మెడికల్ రియంబర్స్మెంట్ పెండింగ్ బిల్లుల మొత్తం రూ.180.38 కోట్లు నిధులను డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఒకేసారి విడుదల చేశారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఒకవైపు, లెక్కకు మించిన సంక్షేమ పథకాలు మరోవైపు ఉన్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులకు ప్రాధాన్యత ఇస్తూ డిప్యూటీ సీఎం వాటిని క్లియర్ చేశారు. గత ప్రభుత్వం కాలం లో 04 03 2023 నుంచి 20062025 వరకు పెండింగ్ లో ఉన్న బిల్లులను క్లియర్ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో 26,519 మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట కలిగింది.

# బిర్యానీ పంచాయితీ!

## ఆంధ్రోళ్ల బిర్యానీ అంటూ కవిత సెటైర్లు

- మనమేం తింటం.. ఎలా ఉంటదో
- కేసీఆర్ సార్ చెప్పిండు కదా అని వ్యాఖ్య
- సోషల్ మీడియాలో ఎమ్మెల్సీపై తీవ్ర విమర్శలు
- ఆమె చీప్ ట్రిక్స్ కొత్తేమీ కాదని ఓ నెటిజన్ పోస్ట్
- రాజకీయాలు మానేసి.. బిర్యానీ రివ్యూలు ఇస్తున్నారంటూ
- బీజేపీ లీడర్ విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్



సోషల్ మీడియాతో విమర్శలు..

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలతో చర్చనీయాంశంగా మారారు. ఆంధ్ర బిర్యానీపై ఆమె చేసిన తాజా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. బనకచర్ల ఇష్యూ సందర్భంగా కవిత ఈ కామెంట్స్ చేశారు. 'ఆంధ్రోళ్ల బిర్యానీ మనమేం తింటం? ఆంధ్రా బిర్యానీ ఎలా ఉంటదో కేసీఆర్ సార్ గతంలోనే చెప్పారు కదా' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు ఆంధ్రప్రదేశ్‌తో సంబంధాలను దెబ్బతీసేలా ఉన్నాయని, తెలంగాణ సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందే ప్రయత్నంగా ఉన్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సోషల్ మీడియాలో కవిత వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసేలా ఈ వ్యాఖ్యలు ఉన్నాయని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'కేసీఆర్ కుటుంబం రాజకీయ లబ్ది కోసం ఇలాంటి చీప్ ట్రిక్స్ కు పాల్పడటం కొత్తేమీ కాదు' అని ఓ నెటిజన్ పోస్ట్ చేశారు. 'తెలంగాణ, ఆంధ్రా ప్రజలు సోదరుల్లా కలిసిమెలిసి ఉండాల్సిన సమయంలో, ఇలాంటి వ్యాఖ్యలు రెచ్చగొట్టేలా ఉన్నాయి' అని విమర్శించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చినా, దీర్ఘకాలంలో రాష్ట్రాల మధ్య సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉందని కొందరు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా, కవిత ఆంధ్ర బిర్యానీ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌కు రాజకీయంగా లబ్ది చేకూర్చినా, రాష్ట్రాల మధ్య సామరస్యాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ వివాదం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

**కవిత బిర్యానీ రివ్యూలు..**

ఎమ్మెల్సీ కవిత పై ఆంధ్రప్రదేశ్ బీజేపి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి సెటైర్ వేశారు. కవిత కొత్త వ్యాపారం ప్రారంభించినట్లుందని ఎక్స్‌లో ట్వీట్ చేశారు. కవిత ప్రస్తుతం రాజకీయాలు మానేసి ఇప్పుడు బిర్యానీ రివ్యూలు చేస్తున్నారంటూ ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి ట్వీట్ చేశారు. తెలుగు ప్రజలను విడగొట్టి లబ్దిపొందాలన్న ప్రయత్నం నిరంతరం కొనసాగిస్తున్నట్లుందని అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలతో... ఆంధ్రా - తెలంగాణ పేరుతో ప్రజలను ఇంకా ఎన్నాళ్లకు విడదీసి రాజకీయం చేస్తారంటూ ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రా వాళ్ళంటే మీకు ఎందుకు అంత చులకన భావమని నిలదీశారు. ఒక క ప్రాంతాన్ని అవమానించి మీరు సాధించేది ఏమిటని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఇటువంటివి మానుకుని తెలంగాణ ప్రజల సమస్యలపై దృష్టి పెడితే మంచిదని విష్ణువర్ధన్ రెడ్డి సూచించారు.

# ఈ మూడేళ్లు రేవంత్ రెడ్డే సీఎం

- ఆ తర్వాత మరో 5 ఏళ్లు ఆయనే ఉంటడట
- 9 ఏళ్ల తర్వాత నేను సీఎం కావాలనుకుంటున్నా
- బీఆర్ఎస్ పార్టీకి ఇక ఆ అవకాశం లేదు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని వ్యాఖ్యానించారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు.

**తండ్రి వారసత్వం కొడుకుకే..**

గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు జగ్గారెడ్డి.

**లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి ..**

తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఇజ్రాయెల్‌పై విజయం మాదే

### అమెరికాను చాచి చెంపదెబ్బ కొట్టాం
### ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

**మహా:** ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ తర్వాత ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ తొలిసారిగా స్పందించారు. ఇజ్రాయెల్‌పై విజయం సాధించామన్న ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ, అమెరికాను చాచి లెంపకాయ కొట్టామన్నారు. ఖతార్‌లోని అమెరికా బేస్‌ను తమ క్షిపణులు ధ్వంసం చేశాయని వెల్లడించారు. ఇజ్రాయెల్ అంతం అవుతందనే కారణంతో అమెరికా జోక్యం చేసుకుందని అభిప్రాయపడ్డారు. దీని వల్ల అమెరికాకు ఎలాంటి ప్రయోజనం అందుకోలేదని చెప్పారు. కాల్పుల విరమణ తర్వాత తొలిసారి టీవీ ప్రసంగం చేసిన ఖమేనీ, కిందపడ్డా తనదే పైచేయి అనే తరహాలో ఇరాన్ సుప్రీం లీడర్ మాట్లాడారు. ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ అజ్ఞాతంలోకి వెళ్లారు. ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్లకు దూరంగా రహస్య బంకర్‌లో ఉన్నట్లు అధికారికంగా తెలిపారు. కాల్పుల విరమణ తర్వాత కూడా ఆయన నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన రాకపోవడంతో చాలా మంది ఖమేనీ ఎక్కడంటూ ప్రశ్నించారు. తాజాగా ఇరాన్ ప్రభుత్వ టీవీలో ఈ అంశంపై ఖమేనీ ఆర్కైవ్స్ ఆఫీస్ అధిపతి మెహదీ ఫజైలీని ప్రశ్నించారు.

# ఇన్సూరెన్స్ - షోరూంల సిండికేట్ దందా

- మోసపోయిన వాహనదారుడు
- ఖమ్మం గీతా షోరూం నిర్వాకంతో లబో దిబో మంటున్న బాధితులు
- విలేకరుల సమావేశంలో న్యాయం చేయాలని బాధితుడు కొప్పెర వెంకటేశ్వర్లు వేడుకుంటున్నాడు.

**ఖమ్మం సిటీ, మహా:** ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ ద్వారా ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందని వాహనం కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ఆయా వాహనాల పేరు మీద ఇన్సూరెన్స్ చేయించుకోవడం ఆనవాయితీ. కానీ వాహనం కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి వాహనదారులను మోసం చేస్తే వారి బాధ వర్ణనాతీతం. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం వల్లపురం రావిచెట్టు గ్రామాని చెంది వ్యవసాయ కూలీ చేసుకునే కొప్పెర వెంకటేశ్వర్లు తన భార్య పేరు మీద టాటా మోటార్ కంపెనీకి చెందిన డీసీఎం వ్యాన్ ను ఖమ్మం నగరం శ్రీశ్రీ సర్కిల్లోని గీత షోరూంలో కొనుగోలు చేసి మూడు నెలల తర్వాత ప్రమాదం జరిగితే కొనుగోలు చేసిన షోరూం ఇన్సూరెన్స్ కంపెనీ సిండికేట్ అయి మోసం చేశాయని ఖమ్మం ప్రెస్ క్లబ్లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. గురువారం ఖమ్మం ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొప్పెర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జూన్ 3, 2024న రూ.35 లక్షలకు ఖమ్మం లోని గీతా షోరూమ్ లో టాటా కంపెనీకి చెందిన డీసీఎం (టిజి 29టి0901) (మోడల్ 1916) ను రూ. 31.21 లక్షల ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్ తో కొనుగోలు చేశానని తెలిపాడు. 3 నెలల అనంతరం ఆంధ్రప్రదేశ్ ఒంగోలు దగ్గర సింగరాయకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదం జరిగితే సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీకి సమాచారం ఇచ్చి, ఖమ్మం గీతా షోరూం మహమ్మద్ అబ్జల్ అలీ తెలియజేశాను అన్నారు. ఒంగోలులోని ఎంజి బ్రదర్స్ షోరూమ్ కు వాహనాన్ని తరలించి దానిని బాగు చేయుటకు గీత షోరూం అబ్దుల్ అలీ ద్వారా రూ 1.35 లక్షల రూపాయలు కట్టించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. 45 రోజులలో రిపేర్ చేయిస్తానని సుమారు పది నెలలు అక్కడే ఉంచుకొని ఇన్సూరెన్స్ డబ్బు క్లైమ్ చేసుకొని నన్ను ఇబ్బందులు గురి చేశారని వాపోయాడు. టాటా మోటార్ నిబంధనల ప్రకారం 90 రోజులో ఇవ్వాల్సిన బండిని ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారన్నారు. ఒంగోలు నుండి ఖమ్మం గీత షోరూం కు డిసియం ను తీసుకొస్తే డబ్బులు కడితే బాగు చేస్తా లేకుంటే తీసుకెళ్లమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు రూ. 51,500లు కడుతున్నా కానీ ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్స్, ఒంగోలు ఎంజి బ్రదర్స్ షోరూమ్, ఖమ్మం గీతా షోరూం సిండికేట్ అయ్యి తనకు తీవ్ర అన్యాయం చేశారని, మానసికంగా శారీరకంగా ఆర్థికంగా ఎంతో నష్టపోయానని తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ విలేకరుల సమావేశంలో భార్య వరలక్ష్మి నాగయ్య బుద్ధి వెంకన్న నరేష్ పాల్గొన్నారు.



# కేసీఆర్ పై క్రిమినల్ కేసు పెట్టాలి


- అమర్ సింగ్ ఫోన్ ట్యాపింగ్ పై సుప్రీం తీర్పు ఉంది
- మంత్రి వివేక్ వెంకటస్వామి డిమాండ్

**మహా:** ఫోన్ ట్యాపింగ్ పై మంత్రి వివేక్ వెంకటస్వామి సంచలన వ్యాఖ్యలు చేశారు. దుబ్బాక, మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించినందుకే తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఅర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అమర్ సింగ్ ఫోన్ ట్యాపింగ్ ను సుప్రీంకోర్టు అప్పట్లో తీవ్రంగా పరిగణించిందని గుర్తు చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేసిన కేసీఆర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పటాన్ చెరులో కేసీఆర్ తన పరిశ్రమను బంద్ చేయించినా వెనక్కి తగ్గలేదని మంత్రి వివేక్ చెప్పారు. తెలంగాణ లో 119 నియోజకవర్గాల్లో గెలిచిన వారందరు రాజులేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈడీ నోటీసులు ఇస్తే విచారణకు హాజరయ్యానని.. ట్యాపింగ్ పై విచారణకు పిలిస్తే విచారణకు హాజరవుతానని మంత్రి వివేక్ చెప్పారు.

### దండకారణ్యంలో

# ఘోర ఎన్‌కౌంటర్

## మహిళా మావోకులకు బుల్లెట్ బలి – భద్రతా బలగాల దూకుడు



**భద్రాచలం, మహా:** మావోయిస్టుల గుండెనొప్పిగా మారిన ఛత్తీస్‌గఢ్ అబూజ్‌మడ్ అడవుల్లో మరోసారి భద్రతా బలగాల 'ఆపరేషన్ కగార్' తన దూకుడు చూపించింది. దండకారణ్యపు లోతైన అడవులు గురువారం తెల్లవారుజామున భీకర ఎదురుకాల్పులతో దద్దరిల్లాయి. మావోయిస్టు దళాలతో జరిపిన ఎన్కౌంటర్లో రెండు మహిళా నక్సలైట్లు మృతిచెందారూ మృతులిద్దరూ మాడ్ డివిజన్‌కు చెందిన కీలక కార్యకర్తలుగా భద్రతా విభాగాలు భావిస్తున్నాయి. స్టేట్ ఇంటెలిజెన్స్‌కు అందిన విశ్వసనీయ సమాచారం ఆధారంగా కోహ్కామెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు రహస్య సమావేశం నిర్వహిస్తున్నారన్న గుట్టురట్టు నేపథ్యంలో, భద్రతా బలగాలు నిశితంగా కూబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. నారాయణపూర్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ కొండగావ్ , స్పెషల్ టాస్క్ ఫోర్స్ బృందాలు సంయుక్తంగా దాడికి దిగాయి. ఈ క్రమంలోనే గురువారం తెల్లవారుజామున మావోయిస్టులతో భద్రతా బలగాలకు తారసపడింది. అప్పటినుండి సుమారు 8 గంటలపాటు భీకరంగా కాల్పులు కొనసాగాయి. తుపాకుల మోతతో అడవులు నిద్రలేచాయి. రెండు వైపులా ఎదురుదాడుల నేపథ్యంలో చివరికి భద్రతా బలగాల చేతిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు బుల్లెట్‌కు బలి అయ్యారు. వారు మాడ్ డివిజన్‌లో క్రియాశీల సభ్యులుగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఘటనా స్థలంలో 2 మృతదేహాలు, ఒక ఇన్సాస్ రైఫిల్, 315 బోర్ గన్, విప్లవ సాహిత్యం, మెడికల్ కిట్, ఇతర లాజిస్టిక్ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్రాజ్ తెలిపారు. అదనంగా భద్రతా బలగాలపై దాడులకు ఉపయోగించే ట్రమ్ సెట్‌లు, కేబుల్ వైర్లు, క్వాడ్‌కాప్టర్ ట్రాప్‌లు కూడా అక్కడ లభించాయి. ఈ ఆపరేషన్‌లో హెలికాప్టర్లు, డ్రోన్లు కీలక పాత్ర పోషించాయని సమాచారం. నిషేధిత సంస్థ కార్యకలాపాలపై నియంత్రణ కల్పించేందుకు భద్రతా బలగాలు మరింత దూకుడు ప్రదర్శిస్తున్నాయి. ఈ ఘటనతో మాడ్ డివిజన్ నెట్‌వర్క్ మరింత బలహీనపడినట్టు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఒక్క రోజు కాదు.. వరుసగా జరుగుతున్న ఈ తరహా ఆపరేషన్‌లు మావోయిస్టుల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. భద్రతా బలగాల లక్ష్యం – ఎర్రజెండా సైనిక కార్యకలాపాలను పూర్తిగా ఉఖిలి చేయడం. ఇందుకోసం కేంద్ర–రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగుతున్నాయి.

**భద్రతా బలగాల హై అలర్ట్**

ఈ ఎన్‌కౌంటర్ అనంతరం సమీప ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. మిగిలిన మావోయిస్టుల కోసం సుదీర్ఘ కూబింగ్ ఆపరేషన్ కొనసాగుతోంది. అనుమానాస్పదుల కదలికలపై నిఘా కొనసాగుతుండగా, మిగిలిన కీలక నేతల కోసం ప్రత్యేక ఆపరేషన్ ప్రణాళికలో ఉంది.

**ఉత్తర బస్తర్ దిశగా కదులుతున్న భద్రతా వ్యూహం**

భద్రతా బలగాల ఉమ్మడి వ్యూహం ఇప్పుడు ఉత్తర బస్తర్ అంచుల వరకూ విస్తరిస్తోంది. ఇది మావోయిస్టుల కంచుకోటగా పేరున్న ప్రాంతమే కావడం విశేషం. భద్రతా దళాల కూబింగ్, ఇంటెలిజెన్స్ మార్గాల బలోపేతం, అధునాతన సాంకేతిక పరికరాల వినియోగం, స్థానిక సమాచార నెట్‌వర్క్ వాడకంతో రెడ్ జోన్ ముదిరిన ప్రదేశాల్లో మావోయిస్టు ప్రభావాన్ని తగ్గించే దిశగా దూకుడు కొనసాగుతోంది.

## బైక్‌లకు టోల్ ఫీజు వసూలుపై క్లారిటీ ఇచ్చిన కేంద్రం

### జూలై 15 నుండి అమలంటూ ప్రచారం

**మహా:** జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు జులై 15 నుంచి టోల్ ఫీజు వసూలు చేయనుందని వస్తున్న వార్తలపై కేంద్రం క్లారిటీ ఇచ్చింది. అలాంటి వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. టూవీలర్లకు టోల్ వసూలు చేసే ఉద్దేశమే లేదని తెలిపారు. కొన్ని మీడియా సంస్థలు ప్రజలను తప్పుదారి పట్టించే వార్తలను వ్యాప్తి చేస్తున్నాయని మండిపడ్డారు. టూ వీలర్ల టోల్ పన్నుపై పూర్తి మినహాయింపు కొనసాగుతుందన్న గడ్కరీ, వాస్తవాలు తెలియకుండా తప్పుడు వార్తలను వ్యాప్తి చేయడం సరికాదన్నారు. ఎన్‌హెచ్ఏఐ కూడా ఈ అంశంపై స్పష్టతనిస్తూ ఎక్స్ వేదికగా స్పందించింది. టూవీలర్స్‌కు టోల్ ఫీజు వసూలుపై వస్తున్న వార్తలు ఫేక్‌న్యూస్ అని స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనాలకు ఉచిత ప్రయాణం ఎత్తివేయనుందని అంతకు ముందు కొన్ని కథనాలు పేర్కొన్నాయి. జులై 15 నుంచి ఛార్జీలను వసూలు చేయనున్నట్లు తెలిపాయి. ఈ క్రమంలోనే ఈ వార్తలను ఖండిస్తూ కేంద్రం ప్రకటన విడుదల చేసింది.

## ఇకపై ఇందిరా క్యాంటీన్లు

హైదరాబాద్: అన్నపూర్ణ కేంద్రాలకు పేరు మార్పు చేయాలని ప్రభుత్వం డిసైడైంది. జిహెచ్ఎంసి పరిధిలోని అన్నపూర్ణ రూ.5 భోజన కేంద్రాలను ఇకపై "ఇందిరా క్యాంటీన్లు"గా జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మార్చనుంది. ఈ మేరకు స్టాండింగ్ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది.



ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 23-06-2025
WWW.MAHAADAILY.COM


# చరిత్ర సృష్టించిన శుభాంశు





## ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారతీయుడు

### అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14 రోజులు 60 ప్రయోగాలు చేయనున్న శుభాంశు టీమ్

మహా స్పెషల్

భారత అంతరిక్ష చరిత్రలో వ్యోమగామి శుభాంశు శుక్లా సరికొత్త రికార్డ్ సృష్టించారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో డ్రాగన్ వ్యోమనౌక అనుసంధానమయ్యే డాకింగ్ ఘట్టం విజయవంతమైంది. దీంతో శుభాంశు శుక్రా తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి జితేందర్ సింగ్ అభినందనలు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలా ఒక నిమిషానికి ఫ్లోరిడాలోని నాసా కెన్నడీ అంతరిక్ష ప్రయోగం కేంద్రం నుంచి నింగిలోకి దూసుకెళ్లిన డ్రాగన్ వ్యోమనౌక 28గంటలు ప్రయాణించి ఐఎస్ఎస్‌కు చేరుకుంది. యాక్సియం-4 మిషన్‌కు సంబంధించిన డాకింగ్ ప్రక్రియ పూర్తయినప్పటికీ నలుగురు వ్యోమగాములు వెంటనే ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించలేదు. కొద్దిసేపు డ్రాగన్ వ్యోమనౌకలో తనిఖీలు, సర్దుబాట్లు చేశారు. ఐఎస్ఎస్, డ్రాగన్ వ్యోమనౌకలో పీడనం ఒకేతీరులో ఉండేలా వ్యోమగాములు చేశారు. లీకేజీలేమైనా ఉన్నాయా అని పరిశీలించారు. ఆ తర్వాతే శుభాంశు బృందం అంతర్జాతీయ అంతరికక్ష ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించింది. భారత వ్యోమగామి శుభాంశు శుక్లాతోసహా నలుగురు వ్యోమగాములు వెళ్లిన డ్రాగన్ వ్యోమనౌక ఐఎస్ఎస్‌తో అనుసంధానం డాకింగ్ చాలా సంక్లిష్ట, సున్నిత ఆపరేషన్. ఇందుకోసం డ్రాగన్ వ్యోమనౌక తన వేగాన్ని, స్థితిని అత్యంత కచ్చితత్వంతో అంతరిక్ష కేంద్రంతో సమన్వయం చేసుకుంది. లెక్కల్లో ఎక్కడ తేడా వచ్చినా ప్రమాదం పొంచి ఉంటుంది. అందువల్ల డ్రాగన్ వ్యోమనౌక చాలా నెమ్మదిగా దగ్గరైంది. ఈ క్రమంలో స్వల్పస్థాయి సర్దుబాట్లనూ అత్యంత కచ్చితత్వంతో చేసుకుంది. అంతిమంగా అది ఐఎస్ఎస్‌కు చెందిన హార్మనీ మాడ్యూల్‌తో అనుసంధామైంది.

### అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో..

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా బృందం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 14రోజులపాటు గడపనుంది. వారు దాదాపు 60 ప్రయోగాలు చేస్తారు. అందులో హ్యూమన్ ఫిజియాలజీ, న్యూట్రిషన్, సీడ్ జెర్మినేషన్‌లలో మైక్రో గ్రావిటీ పరిశోధనలున్నాయి. ప్రధాని మోదీతో సంభాషించటంసహా అంతరిక్షం నుంచే శుక్లా పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యోమగాములు 14 రోజులపాటు స్థానికంగా లభించే ఆహారాన్నే తీసుకోనున్నారు.

### లైవ్ కాల్‌లో మాట్లాడిన శుభాంశు

అంతరిక్ష కేంద్రానికి చేరుకునే ముందు శుభాంశు, లైవ్ కాల్‌లో మాట్లాడారు. ఈ ప్రయాణం చాలా అద్భుతంగా ఉందని తెలిపారు. భారరహిత స్థితిలో ఎలా నడవాలో చిన్నపిల్లాడిలా నేర్చుకుంటున్నానని అన్నారు. ఇక్కడున్న ప్రతీ క్షణాన్ని ఆస్వాదిస్తున్నాని చెప్పారు. తన భుజంపై మువ్వన్నెల పతాకం ఉందని, అది చూస్తున్నప్పుడు తాను ఒంటరి కానని, కోట్లాది మంది భారతీయులు తోడుగా ఉన్నారనే భావన కలుగుతుందని చెప్పారు. కాసేపటికే డాకింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అంతరిక్ష కేంద్రంలోకి అడుగుపెట్టారు.

### ఆ 14 రోజుపై అత్యంత ఆసక్తిగా ఉంది: శుభాంశు శుక్లా


అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాంశు శుక్లా.. మిగతా 14 రోజులు తాము ఇక్కడ చేసే పరిశోధనే అత్యంత ఆసక్తిని కల్గిస్తుందని స్పష్టం చేశాడు. ప్రస్తుతానికి కాస్త చిన్నపాటి తలనొప్పిగా ఉన్నప్పటికీ అదేమీ పెద్ద సమస్య కాదన్నాడు. తమ ముందున్న టాస్క్ అనేది చాలా ముఖ్యమని చెప్పకొచ్చాడు శుభాంశు శుక్లా. ‘ఇది చాలా గర్వించదగ్గ సమయం. మన అంతరిక్షయానంలో ఇదొక మైలురాయి. 14 రోజుల పరిశోధన మాకు అత్యంత కీలకం కానుంది’ అని ఐఎస్ఎస్ నుంచి శుభాంశు తెలిపాడు.

### ఆరుసార్లు వాయిదా పడి..

ఆరు సార్లు వాయిదాలు పడిన తర్వాత బుధవారం శుభాన్ను శుక్లా అంతరిక్షంలోకి ప్రయాణించాడు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన మొదటి భారతీయ హోమ్యమగామిగా శుభాన్ను శుక్లా ఘనత సాధించాడు. ఇటీవల క్రితం సునితా విలియమ్స్ ఐఎస్ఎస్ లో నెలలపాటు గడిపింది. ఆమె ప్రవాస భారతీయురాలు, అమెరికా పౌరురాలు. ఆక్సియమ్ మిషన్ 4 అని పిలువబడే ఈ మిషన్ నాసా, ఆక్సియమ్ స్పేస్ మరియు స్పేస్ఎక్స్‌లతో ఉమ్మడి ప్రాజెక్ట్. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ స్పేస్ సెంటర్‌లోని లాంచ్ కాంప్లెక్స్ 39ఏ నుంచి ఈ ప్రయోగం జరిగింది. శుభాన్ను శుక్లా పైలట్‌గా పనిచేస్తున్నారు. మరో ఇద్దరు మిషన్ నిపుణులు చేరారు. పోలాండ్‌లోని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ నుండి ప్రాజెక్ట్ వ్యోమగామి స్లావోజ్ ఉజ్నాన్స్కీ-విస్నియెస్కీ, హంగేరీ ప్రోగ్రామ్ నుండి వ్యోమగామి టిబోర్ కాపు లు ఉన్నారు.










### రేషన్ కార్డు లబ్ధిదారులు
# ఈనెల 30లోగా బియ్యాన్ని తీసుకోవాలి
**పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహాన్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం, రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు, ఒకేసారి మూడు నెలల బియ్యాన్ని లబ్ధిదారులు తీసుకోవాలని, పౌర సరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డిఎస్ చౌహాన్ ఐపీఎస్, ప్రజలకు సూచించారు. ఇప్పటికే 92 శాతం కోట పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా రేషన్ బియ్యం తీసుకొని వారు ఎవరైనా ఉన్నట్లయితే వెంటనే తమ దగ్గరలోని రేషన్ షాప్ కు వెళ్లి, ఈనెల 30 లోపు తీసుకోవాలని ఆయన తెలిపారు.



## నేడు మార్కెట్ దుకాణ సముదాయాలు ప్రారంభం

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆమనగల్లు మార్కెట్ యార్డ్ ఎదుట నిర్మించిన దుకాణ సముదాయాన్ని నేడు శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా తెలిపారు. ప్రారంభోత్సవానికి అన్నీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈమేరకు వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి మార్కెట్ యార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మార్కెట్ యార్డ్ ఆవరణలో రూ.62 లక్షలతో 8 దుకాణాలు నిర్మించినట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో సీసీ రోడ్ల నిర్మాణం, రైతులకు వసతుల కల్పనకు ప్రతిపాదనలు రూపొందించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.



### వివిధ ప్రభుత్వ పథకాల అమలు పై
## సమీక్ష సమావేశం
**పాల్గొన్న నగర మేయర్, కమిషనర్**

**వరంగల్ మహా;** బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ లో మెప్మా విభాగానికి చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్స్ (సి ఓ) లతో ఈ విభాగానికి సంబంధించిన అధికారులతో వివిధ ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగర మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొని సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, టిఎంసి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సకినాల రమేష్, ప్రవీణ్, సఫియా, శ్రీలత, గుండు రమ, సుజాత, శ్రీనివాసులు, రాజ్ కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

# యువత మత్తుకు బానిసలుగా మారద్దు
**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**



**హన్మకొండ మహా;** యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మరొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ యువతకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో భీమారంలోని ఎస్. వీ ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్ పోలీస్ కమిషనర్, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ముందుగా కాలేజీ ఆవరణలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా మొక్కలను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో మాదక ద్రవ్యాలను పూర్తిగా తరిమికొట్టాల్సిన భాధ్యత మనందరి పై ఉందన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా వుండాలని, డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారంగా మారుతుందని యువత డ్రగ్స్ పై పోరాటం చేయాలని సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించిన, వినియోగించిన పోలీసులకు సమాచారం అందించాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలసికట్టుగా ముందడుగు వేసి వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మారుద్దామని అన్నారు. సమాజంపై మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిడబ్ల్యూఎంసి కమిషనర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దన్నారు అనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకం సంఘటితం అవుతామని, సమాజం నుండి మాదక ద్రవ్యాలను తరిమి వేద్దామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు నర్సింహా రావు, కాజీపేట్ ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్, శివకుమార్, రంజిత్ కుమార్, కేంద్ర సాహిత్య అవార్డు అంపశయ్య నవీన్, ఆచార్య రవికుమార్, అనిత ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### వేసేందుకు ప్రతి ఒక్కరూ
# కంకణ బద్ధులు కావాలి
**జిల్లా ప్రధాన జడ్జి రమేష్ బాబు**



**భూపాలపల్లి, మహా :** సమాజంలో రోజురోజుకు విస్తరిస్తున్న మత్తు పదార్థాల వినియోగాన్ని సమాజం నుంచి తరిమేసి వేసేందుకు ప్రతి ఒక్కరు కంకణ బద్దులు కావాలని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీహెచ్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాలు నివారణలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమైనదని అన్నారు. గురువారం అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డా బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణం నుండి ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు నిర్వహించిన అంతర్జాతీయ మత్తు పదార్థాల నివారణ ర్యాలీ లో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే తదితరులు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న డ్రగ్స్ భూతాన్ని సమాజం నుండి తరిమేయాలని పిలుపునిచ్చారు. తల్లి దండ్రులు పిల్లల అలవాట్లును నిశితంగా గమనించాలని, డ్రగ్స్ కు అలవాటుపడ్డ వారిలో వచ్చే మార్పులను గుర్తించడం సులువైన పని అని అన్నారు. ఇంటి నుండే మార్పు మొదలవ్వాలని తెలిపారు. డ్రగ్స్ భూతాన్ని తరిమేయడంలో సహాయం కావాల్సిన వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థను కానీ పోలీసు శాఖను సంప్రదించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ డ్రగ్స్ ను తరిమేయడంలో ప్రతి ఒక్కరి బాగస్వామ్యం అవసరమని అన్నారు. మత్తుపదార్థాల నిర్మూలన కోసం కఠిన నిర్ణయాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి మరియు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజు , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడీషనల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి జి.అఖిల, అడీషనల్ కలెక్టర్ లు పి. అశోక్ కుమార్, శ్రీమతి విజయలక్ష్మి , అడీషనల్ ఎస్. పి. నరేష్ కుమార్, సింగరేణి జి.ఎం.రాజేశ్వర్ రెడ్డి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి , ఎక్సయిజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ , విద్యా శాఖ అధికారి రాజేందర్, అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు, న్యాయవాదులు, డి.ఎస్.పి లు సంపత్ రావు, సూర్యనారాయణ, విద్యార్థులు, పోలీసు అధికారులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మరియు వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### నేడు తాడిచెర్ల లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత
## నిర్మాణ సన్నాహక సమీక్షా సమావేశం

**కాటారం, మహా :** మల్హార్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమీక్షా సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2:00 గంటలకు జరుగుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బడితల రాజయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరవుతున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర వాణిజ్య ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, కుడా చేర్మెన్ ఇనగాల వెంకట్రామి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా అబ్జర్వర్ లింగజీ పాల్గొంటున్నారు.ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, గ్రామ కాంగ్రెస్ శాఖల అధ్యక్షులు, ఎస్ టి సెల్, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, అనుబంధ సంఘాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ సభ్యులు, కాంగ్రెస్ అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మల్హార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బడితల రాజయ్య విజ్ఞప్తి చేశారు.

# మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి
**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




**హన్మకొండ మహా;** మాదక ద్రవ్యాల వాడకం వల్ల సమాజానికి, ఇటు యువతకు కలిగే అనర్థాలను గురించి ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, పోలీస్, తదితర ప్రభుత్వ శాఖలతో పాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పై వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఎన్సిసి కేడేట్లతో నక్కలగుట్ట నుండి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వరకు చేపట్టిన ర్యాలీని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి క్షమా దేశ్ పాండే జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ అదాలత్ సర్కిల్ మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్దకు చేరగా ర్యాలీని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ , బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ గత 15 ఏళ్ల క్రితం మాదక ద్రవ్యాల వినియోగం ఇంతగా లేదన్నారు. సమాజానికి మహమ్మారిలా సోకిన మాదక ద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పాఠశాలల నుండే అవగాహన కార్యక్రమాలు ప్రారంభించాలని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలు చెబుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాల భారీన పడినట్లయితే జీవితం మళ్లీ వెనక్కు రాలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులతో నిరంతరం వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, వారి అలవాట్లను గమనించాలన్నారు. ప్రస్తుత సమాజంలో అందరూ బిజీగానే ఉంటున్నారని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ పిల్లలతో ప్రతిరోజు మాట్లాడుతూ వారికి ఉన్న ఇష్టాలను తెలుసుకోవాలని, అలాగే మాదకద్రవ్యాల నియంత్రణలో దేశంలోనే తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో ఎంతో ముఖ్యమైనది అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదకద్రవ్యాల నిర్మూలనకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వారం రోజుల పాటు మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా వివిధ కార్యక్రమాలను విజయవంతంగా వివిధ శాఖల సహకారంతో నిర్వహించు కుంటున్నామని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా వారు కోరారు. . అనంతరం మత్తు పదార్థాల జోలికి వెళ్ళమని, వాటికి దూరంగా ఉంటామని విద్యార్థులు, యువత చేత ప్రతిజ్ఞ చేయించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి
**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో విద్యార్థుల నమోదు పై పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ గురుకులాల అధికారులు, ఎంఈవో లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో గత, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎంతమంది విద్యార్థుల నమోదు జరిగిందనే వివరాలను జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు గురించిన సమాచారాన్ని జిల్లా విద్యా శాఖాధికారి వాసంతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల చేరికల గురించి ఇంటర్మీడియట్ విద్యా శాఖ సూపరింటెండెంట్ చంద్రమౌళి జిల్లా కలెక్టర్ కు వివరించారు. అంగన్వాడి కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు ఎంత శాతం ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి తరగతిలో చేరారు, ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంతమంది ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాలకు వెళ్లారనే వివరాలను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల నమోదు ఇంకా పెరగాలన్నారు. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలలో చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. విద్యార్థులందరికీ యూనిఫామ్స్ అందజేయాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ ను మూడు వేలు పెంచాలన్నారు. తక్కువ ఎన్ రోల్మెంట్ ఉన్న మండలాల్లో విద్యార్థులు ఎక్కువ నమోదు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, సీఎంఓ సుదర్శన్ రెడ్డి ,ఏఎస్సీ రఘు చంద్ర రావు, వివిధ మండలాల ఎంఈఓలు, సంక్షేమ అధికారులు, సిడిపిఓలు పాల్గొన్నారు.

## ఎల్బీ కళాశాలలో డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం
**విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న వరంగల్ ఏసిపి**



**వరంగల్ మహా ;** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎల్బీ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ ఆధ్వర్యంలో కాలేజీ మినీ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, శారీరక, మానసిక సమస్యలు, సామాజిక ప్రభావాల పై చర్చించారు. అనంతరం బడి పిల్లలతో కలిసి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా సమాజంలో మాదక ద్రవ్యాల నిర్మూలన పై అవగాహన పెంపొందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మట్టేవాడ ఇన్స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు, ఎన్సిసి స్టూడెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ను కలిసిన కొరివి పరమేశ్
**స్థానిక ఎన్నికల గెలుపే లక్ష్యంగా యువత కృషి చేయాలి**



**వరంగల్ మహా;** తెలంగాణ కాంగ్రెస్ కమిటీలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించబడ్డ శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య ను వారి నివాసంలో వరంగల్ రూరల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేశ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం యువత కృషి చేయాలని ప్రభుత్వం అందిస్తున్న పథకాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతిపక్షాల కుట్రలు భగ్నం చేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని తిరుగు లేని శక్తిగా మార్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, అనిల్, వెంకట్ ,వల్లభనేని శ్రీకాంత్, చక్రి, రనయ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని చెరబట్టిన కాంగ్రెస్ నేడు అది పట్టుకుని తిరుగుతోంది



**ఖమ్మం,మహా.** "చరిత్ర లేకుండా వర్తమానం ఉండదు. వర్తమానం లేకుండా భవిష్యత్తు ఉండదు" అని పదునైన పదాలతో కాంగ్రెస్ పార్టీని విమర్శించిన మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ జాతీయ నాయకుడు శ్రీ ఈటెల రాజేందర్ ఖమ్మం లో జరిగిన 'సంవిధాన్ హత్య దినం' కార్యక్రమంలో తన ప్రసంగం ద్వారా సెంటర్ ఆఫ్ గ్రావిటీగా నిలిచారు. ఖమ్మం వీడియోస్ కాలనీలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో నిర్వహించిన ఈ మీడియా సమావేశంలో, ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ స్పందనకు దారి తీస్తున్నాయి. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ - "1975 77 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ ప్రజాస్వామ్యాన్ని చంపేసిన చీకటి అధ్యాయంగా చరిత్రలో నిలిచిపోయింది. నేడు అదే పార్టీ రాజ్యాంగాన్ని పట్టుకుని తిరుగుతూ దానిపై ప్రేమనటిస్తోంది. కానీ ప్రజాస్వామ్యాన్ని తొక్కినది వారే, అంబేద్కర్ గారిని అవమానించినది వారే" అన్నారు. కాంగ్రెస్ పాలనలో పత్రికా స్వేచ్ఛ ఖూనీ చేయబడిందని, అభిప్రాయ స్వేచ్ఛ కొట్టేసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "అంబేద్కర్ గారిని కాంగ్రెస్ మంత్రివర్గం నుండి తొలగించిందంటే ఆ పార్టీ రాజ్యాంగాన్ని ఎట్లా గౌరవిస్తుందని చెప్పగలదు? ఆయనను ఎన్నికల్లో ఓడించిన నాయకుడు నెహ్రూనే" అని అన్నారు. ఆ పార్టీ రాజ్యాంగ బద్ధత పట్ల ఉండే అబద్ధపు ప్రేమను ఈటెల ఆవిష్కరించారు. రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగిన ఈటెల గారు - "రాహుల్ గాంధీ మాటలు ఒకలా, చర్యలు మరోలా ఉంటాయి. బీసీ, ఎస్టీ ముఖ్యమంత్రుల గురించి మాటలు చెబుతారు, కానీ ఆ వర్గాలకు ఒక్కరినీ ముఖ్యమంత్రిగా చేసే దమ్మూ లేదు. కాంగ్రెస్ గెలవడానికి వాగ్దానాలు చేస్తుంది. అధికారంలోకి వచ్చాక వాటిని మర్చిపోతుంది" అన్నారు. తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 66 హామీలు ఎటెన్నయ్యాయంటూ ప్రజలకు వేడుకల నెపంతో మోసం చేస్తున్నారని ఆరోపించారు. ''పేదల బలిపశువుల్లా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం మాట్లాడుతుంది గానీ, అభివృద్ధి గురించి ఆలోచించదు'' అన్నారు. భారతీయ జనతా పార్టీ మాత్రం నిజమైన ప్రజాస్వామిక ధ్యేయాలతో ముందుకెళ్తోందని, దేశానికి మొట్టమొదటి ఓబీసీ ప్రధానమంత్రిని ఇచ్చింది. ఆ తర్వాత దళితుడైన కోవింద్ ని రాష్ట్రపతిగా నియమించింది. ఇప్పుడు ఆదివాసీ బిడ్డ అయిన ద్రౌపది ముర్ము గారిని రాష్ట్రపతిగా చేసింది. ఈ ముగ్గురు నాయకులు నరేంద్ర మోదీ గారి ప్రజా సంకల్పానికి నిదర్శనమని తెలిపారు. ఇంటిగలల పథకాలపై కూడా విమర్శలు వెల్లువెత్తాయి. "కేంద్రం 3 లక్షల ఇండ్లకు నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం లక్షన్నర ఇండ్లు కూడా కట్టలేదు. ఖచ్చితంగా పేదలకు ఇవ్వాల్సిన ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకు కేటాయించారు. ఇది వారిదేం జాగీరు కాదు" అని హెచ్చరించారు. మీడియా సమస్యలపై దృష్టి: ఈటెల విలేకరుల సమస్యలను ప్రస్తావిస్తూ - "ఖమ్మం జర్నలిస్టులకు ఆనాటి ప్రభుత్వం 23 ఎకరాల స్థలం కేటాయించినా అమలు కాలేదు. ఇప్పటికైనా జర్నలిస్టులకు 100-120 గజాల స్థలంలో ఇండ్ల స్థలాలు ఇవ్వాలి. ఇది వారి ప్రాధాన్యత గల హక్కు" అని అన్నారు.

## తుర్కయంజాల్ లో నిర్వహించిన జిల్లా సహకార బ్యాంక్ మహాజన సభ సమావేశం



- డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య
- రైతులకు అందిస్తున్న సహకారాల గురించి చర్చ

**రంగారెడ్డి జిల్లా మహా:** తుర్కయంజాల్ లోని తులిప్స్ గ్రాండ్ హోటల్లో ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (HDCCB) మహాజన సభ సమావేశం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బ్యాంకు పరిపాలన నివేదిక, బ్యాంకు యొక్క జమ, ఖర్చు, లాభనష్టాలు మరియు ఆస్తులు అప్పుల మహాజన సభ ముందు ప్రవేశపెట్టడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో పలు అంశాల పై, PACS (సొసైటీ) చైర్మన్ ల సమస్యలు, సందేహాలపై, వ్యవసాయానికి రైతులకు అందిస్తున్న రుణ సహాయం, ఇతర రుణాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎస్.రవీందర్ గౌడ్, సీఈఓ భాస్కర సుబ్రహ్మణ్యం మరియు డైరెక్టర్లు పి .అంజిరెడ్డి, డి.చంద్రశేఖర్, బి.సతీష్, ఎం.బాల్ రెడ్డి, పి.రామ్ రెడ్డి, పి.లక్ష్మారెడ్డి, కె.శ్యాంసుందర్ రెడ్డి, జి సైదా, పీ.జీ.వి రాణి, ప్రొఫెషనల్ డైరెక్టర్ల వి.గిరిధర్, పిఎసిఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, వివిధ మండల సొసైటీ చైర్మన్ లు, డీసీసీబీ బ్యాంక్ జి.ఎంలు ప్రభాకర్ రెడ్డి, ఫణి శ్రీరాం, డి.జి.ఎంలు నాగంజలి, కిరణ్ కుమార్, సతీష్ రెడ్డి, ఎ.జి.ఎంలు బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు నో చెప్పండి
**అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ అధ్యక్షతన మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ "మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగం పై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని డ్రగ్స్ వాడకం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండి, నాతో పాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియచేస్తానని, డ్రగ్ రహిత జీవనశైలిని అనుసరిస్తానని, డ్రగ్‌రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామినవుతానని" ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలపై చర్చించి, ఇకముందు చేపట్టవలసిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ, యువత మరియు సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు సోషల్ మీడియాతోపాటు కళాశాలల్లో, పాఠశాలలో కూడా రాచకొండ కమిషనరేట్ ద్వారా ప్రభుత్వ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ ప్రజలు, విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని, తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడడం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు.

### డ్రగ్స్ మీద పోలీసుల పోరాటంలో యువత సహకరించాలి

డ్రగ్స్ మీద పోలీసులు చేస్తున్న పోరాటంలో యువత తమ వంతు భాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతో పాటు, తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ డ్రగ్స్ కు నో చెప్పండి, Say To No Drugs పోస్టర్ ను విడుదల చేశారు.

# షాద్ నగర్ వద్ద రోడ్డు ప్రమాదం



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కేశంపేట బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం లో ఆగి ఉన్న డీసీఎం లారీని కారు ఢీకొన్న ఘటనలో.. సంఘటన స్థలంలోనే ఒకరు దుర్మరణం పాలైనట్లు స్థానికులు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరో ఆటోస్ట్ కూడా కాళ్లు విరిగాయని స్థానికులు తెలిపారు. ఈ సంఘటన సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# ఆర్టీసీని బలోపేతం చేయండి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- టీజీఆర్టీసీ పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్



**షాద్ నగర్, మహా:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఆర్టీసీ)ని మరింత బలోపేతం చేసి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆర్టీసీ సిబ్బందిని కోరారు. గురువారం శాసనసభ కమిటీ హాల్‌లో టీజీఆర్టీసీ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యే శ్రీ లక్ష్మీ కాంతారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ తాత మధు, మరియు శాసనసభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని గుర్తు చేశారు. ఈ పథకం అమలు కోసం 202324 ఆర్థిక సంవత్సరంలో రూ. 1045 కోట్లు, 202425 ఆర్థిక సంవత్సరంలో రూ. 3616 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఆర్టీసీని మరింత పటిష్టం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆయన ఆర్టీసీ అధికారులకు, సిబ్బందికి కోరారు. 20142023 సంవత్సరాలకు సంబంధించిన ఐదు ఆడిట్ పారాలను కమిటీ ఈ సందర్భంగా సమీక్షించింది. ఆర్టీసీకి చెందిన సొంత స్థలాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ ఉన్నతాధికారులపై ఉందని, దీనిపై వారు చొరవ చూపాలని వీర్లపల్లి శంకర్ అన్నారు. అలాగే, ఆర్టీసీ సముదాయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఖాళీ స్థలాలను లీజుకు ఇచ్చినట్లయితే, గడువు ముగిసేలోపు కొత్త టెండర్లను పిలిచి ఆర్టీసీ ఆదాయాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ స్పెషల్ సెక్రెటరీ ఉదయ్ కుమార్, తెలంగాణ ఆడిట్ జనరల్ మాధవితో పాటు ఇతర ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద**



**వరంగల్, మహా:** మాదకద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మిద్దాందుకు కంకణబద్ధులు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నగర మేయర్ గుండు సుధారాణి పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం వరంగల్ ఎంజీఎం చౌరస్తా నుండి పోచమ్మ మైదాన్ చౌరస్తా వరకు మాదకద్రవ్య రహిత భారత్ లక్ష్యంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిసిపి అంకిత్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా కఠినమైన చర్యలు తీసుకుంటుందన్నారు. మాదకద్రవ్యాలను తీసుకోక ముందే వాటిని నివారించాలనే స్లోగన్ తో ముందు కెళుతున్నామని, మత్తు వల్ల కలిగే అనర్థాల గురించి చిన్నతనంలోనే పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో కాలేజీలలో యూనివర్సిటీలలో డ్రగ్స్ నివారణ కమిటీలు వేయాలన్నారు. యువత ఒత్తిడిని అధిగమించడానికి యోగా, శారీరక శ్రమ చేయాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కు కష్టపడి చదివిస్తున్నారని వారి ఆశయాలను నేరవేర్చాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ**

మత్తు పదార్థాలను అరికట్టేందుకు ప్రజలు యువత విద్యార్థులు కలిసికట్టుగా ముందడుగు వేసి వరంగల్ ను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చుదామని అన్నారు. సమాజంపై మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇతర అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణ, నిబద్ధత పట్టుదలతో జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవచ్చునని అన్నారు. సమాజంలో ఏ ఒక్కరు డ్రగ్స్ కు బానిస కాకుండా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఈ ఉద్యమంలో యువత సైనికుల్లా ముందుకెళ్లాలని. అధికారులు భాగస్వామ్యులై ఉన్నామని కలెక్టర్ తెలిపారు. డిసిపి అంకిత్ కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామని, డ్రగ్స్ వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, అందువల్ల అందరూ బాధ్యతతో ముందుకు వచ్చి ప్రాణాంతకంగా పరిణమించే మాదకద్రవ్యాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం మాదకద్రవ్యాల నివారణకు కృషి చేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిడబ్ల్యుఎంసీ కమిషనర్ చాహత్ బాజ్పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కార్పొరేటర్ జన్ను శిభారాణి, ట్రైనీ కలెక్టర్లు జయసింహా, హరిప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, జెడ్పి సిఈఓ రామిరెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి, డీఈఓ జ్ఞానేశ్వర్, అధికారులు, సిడిపిఓలు, పోలీస్ అధికారులు, మెప్మా సిబ్బంది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఓటర్ జాబితా నుంచి చెన్నమనేని రమేశ్ పేరు తొలగింపు

**రెవెన్యూ శాఖ నోటీసు జారీ!**

**రాజన్న సిరిసిల్ల, మహా :** వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు పేరును ఎన్నికల ఓటర్ జాబితా నుండి తొలగించేందుకు రమేష్‌బాబు ఇంటికి నోటీసులు అంటించిన రెవెన్యూ అధికారులు రాష్ట్ర హైకోర్టు చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడిగా నిర్ధారించిన నేపథ్యంలో ఎన్నికల ఓటర్ జాబితా నుండి ఫామ్ 7 ప్రకారం పేరును తొలగిస్తున్నట్లు వేములవాడలోని నివాసానికి నోటీస్ అంటిజేసి రిజిస్టార్ పోస్ట్ చేసిన అధికారులు... ఓటర్ జాబితా నుండి పేరు తొలగింపు పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే జూలై 02 తేదీ లోగా సమాధానం ఇవ్వాలని పేర్కొన్న అధికారులు.. రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకే ఎన్నికల ఓటర్ జాబితా నుండి పేరు తొలగిస్తూ నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించిన రెవిన్యూ అధికారులు..

# సమాజంలో మార్పు.. చైతన్యం కోసమే బీజేపీ



**రాష్ట్ర కార్యదర్శి బి.చంద్రశేఖర్**

**కరీంనగర్, మహా:** సమాజంలో మార్పు, చైతన్యం కోసం అఖిల భారతీయ గ్రాహక్ పంచాయత్ నిరంతరం పనిచేస్తుందని ఏబి జి పి రాష్ట్ర కార్యదర్శి బి. చంద్రశేఖర్ తెలిపారు. ఏ బి జి పి కరీంనగర్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. నేటి సమాజంలో యువత మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా అవగాహనా సదస్సులు నిర్వహించడం, సైబర్, క్రైమ్ ల పైన అవగాహనా పెంపొందించడానికి ఏ బి జి పి తగిన కార్యచరణలతో ముందు కొనసాగాలని తెలిపారు. రైతులకు విత్తనాలు, పేస్టిసైడ్స్ కొనుగోలు సమయంలో చూసుకోవాల్సిన అంశాలను తెలియపరచాలని సూచించారు. ఆన్లైన్ గేమింగ్ లపైన అవగాహనా సదస్సులు చేపట్టాలని , ప్రజలను చైతన్యం చేసే దిశగా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని సమావేశంలో చర్చించారు. అనంతరం జూన్ 8వ తేదీన జరిగిన రాష్ట్ర సర్వసభ్య సమావేశ వివరాలు రాష్ట్ర కార్యదర్శి బి. చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమల్ల సురేష్, జిల్లా బాద్యులు నలువాల రాజేందర్,సురభి శ్రీధర్,సత్యనారాయణ రావు, హరి ప్రసాద్,తిప్పర్తి శ్రీనివాస్, రాజశేఖర్,మాణితేజ, అశోక్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు

# మాదకద్రవ్యాలు వద్దు - జీవితం ముద్దు

- విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- చెడు అలవాట్లకు బానిసలు కావద్దు : సిపిడిఓ వినీతాదేవి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం జూన్ 26 సందర్భంగా, మాదకద్రవ్య రహిత తెలంగాణను ఏర్పరచుకోవాలని, రంగారెడ్డి జిల్లా, మంచాల మండల పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన, "మత్తు పదార్థాల నివారణ" కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఇందులో ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని వినీతదేవి వివరించడం జరిగింది. TGANB toll free No. 1908 గురించి అవగాహన కల్పించడం జరిగినది. డ్రగ్స్ వాడడం వలన మన శరీరంలో జరిగే మార్పులు, అనర్థాల గురించి వైద్యాధికారి వివరించారు. చెడు అలవాట్లకు బానిసలు అయిన వారికి సమాజంలో ఎలాంటి విలువలు ఉంటాయో వారికి వివరించారు. మాదకద్రవ్య నిర్మూలన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిడిపిఓ వినీతదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... పిల్లలను వారి వృత్తి నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, సమాజంలో గౌరవంగా ఎదగాలని విద్యార్థులకు వివరించారు. ఎవరైనా తమ స్నేహితులు మత్తుకు అలవాటు పడినా హెల్ప్ లైన్ కు సమాచారం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ ఎస్సై విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఇట్టి విషయాన్ని తమ తమ తల్లిదండ్రులకు, స్నేహితులకు ఇతరులకు తెలియ పరచాలని అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సూపర్వైజర్ కల్పన, విద్యుల్లత, పోషణ్, బ్లాక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ జూనియర్ అసిస్టెంట్ తిరుమలయ్య, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఎలికట్ట గ్రామంలో క్షయ వ్యాధి నిర్ధారణ ఎక్స్రే పరీక్షలు

- చించోడు వైద్యాధికారి డాక్టర్ స్రవంతి
- టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో 150 మందికి పరీక్షలు..



**షాద్ నగర్, మహా:** రంగారెడ్డి జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ పాపారావు ఆదేశానుసారము, షాద్ నగర్ డివిజన్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడు ఏరియా, సబ్ సెంటర్ ఎల్లికట్ట గ్రామంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో టీ.బీ ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ... టి.బి అనేది మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్లోసిస్ అనే సూక్ష్మ క్రిమి వలన వ్యాపిస్తుందని చెప్పారు. టీ.బి రోగము ఉన్నవాళ్లు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వారి తుంపర్ల ద్వారా గాలిలో వ్యాప్తి చెంది ఇతరులకు టీ.బీ వ్యాధి వస్తుందని తెలియజేశారు. టి .బి.లక్షణాలు ఇలా ఉంటాయని, రెండు వారాలకు మించి దగ్గు మరియు జ్వరము ఉండడం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి బరువు తగ్గటం, చాతిలో నొప్పి మరియు తగ్గినప్పుడు రక్తం పడటం వంటి లక్షణాలు ఉన్న వారందరూ కూడా గల్ల పరీక్ష మరియు ఎక్స్ రే పరీక్ష చేయించుకున్నట్లయితే టీ.బీ వ్యాధి ఉన్నది లేనిది తెలుస్తుందని అన్నారు.పై లక్షణాలు ఉన్నవారు గల్ల పరీక్ష మరియు ఎక్స్ రే పరీక్షలు ఉచితంగా ప్రభుత్వాసుపత్రిలో చేస్తారని చెప్పారు. ఎవరికైనా టీ.బీ ఉందని పరీక్షలో తేలినట్లయితే వారికి ప్రభుత్వమే దాదాపు 8 వేల రూపాయల విలువ గల మందులు ప్రభుత్వము వారు ఉచితంగా ఇస్తారని, ఆ మందులు రెగ్యులర్ గా 6 నెలలు మింగినట్లయితే టీ. బి వ్యాధి తప్పకుండా నయమవుతుందని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. అలాగే ప్రభుత్వము టీ.బీ రోగం ఉన్న వారికి , ప్రభుత్వము వారు మంచి పోషకాహారము తీసుకోవాలని ఉద్దేశముతో పేషెంట్ యొక్క ఖాతాలో ప్రతినెలా 1000 రూపాయలు వేస్తారని చెప్పారు. ఈ 1000 రూపాయలతో పేషెంట్ వారు బియ్యం, పప్పు దినుసులు, గుడ్లు, పాలు మరియు తాజా కూరగాయలు కొనుక్కోవడానికి ఉపయోగించాలని చెప్పారు. టీ.బీ రోగస్తులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి, క్రమం తప్పకుండా మందులు కచ్చితంగా వాడాలి అని హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు. ఈ టీ.బి ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రాంలో 150 మందికి ఓ.పి చూడడం జరిగిందని, 65 మందికి హెచ్ఐవి పరీక్షలు చేయడం జరిగింది అని, 36 ఎక్స్రే పరీక్షలు చేయడం జరిగిందని జె.శ్రీనివాసులు తెలియజేశారు. అలాగే హెచ్.ఐ.వి మరియు ఎయిడ్స్ గురించి వ్యాధి ఎలా వస్తుంది? ఏ విధంగా వ్యాపిస్తుంది అని, ఎయిడ్స్ రాకుండా ఉండాలి అంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా తెలియజేశామన్నారు. అనంతరం డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ... టీ.బీ లక్షణాలు ఉన్న వారందరూ కూడా తప్పకుండా గల్ల పరీక్ష మరియు ఎక్స్రే పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వం ఇచ్చే ఖరీదైన ఉచిత మందులు వాడినట్లయితే టీ. బి తప్పకుండా నయం అవుతుందని తెలియజేశారు. అలాగే మీ గ్రామంలో ప్రతిరోజు ఎం ఎల్ హెచ్ పి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ వస్తారు , వీరితో బీపీ మరియు షుగరు పరీక్షలు చేయించుకొని తగిన మాత్రలు తీసుకోవాలని తెలియజేశారు.

# సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుంది

- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన
- పార్టీ బలోపే దానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- స్థానిక సంస్థలలో ప్రజల నాయకుని ఎన్నుకోవాలి
- కప్పాటి పాండురంగా రెడ్డి, మదనపాల్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సంస్థాగత నిర్మాణం పటిష్టంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందని కప్పాటి పాండురంగా రెడ్డి, మదనపాల్ రెడ్డి అన్నారు. ఏఐసిసి, పిసిసి ఆదేశం మేరకు మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కిచ్చన్న లక్ష్మారెడ్డి, సూచనతో పోరడ్ల గ్రామ కమిటీని, కస్టర్ కన్వీనర్ కంబాలపల్లి మదన్ పాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగా రెడ్డి కస్టర్ సభ్యులను ప్రకటించిన అనంతరం వారు మాట్లాడుతూ... ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన 17 మాసాలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ సేవలు 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచడం, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డుల మంజూరు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే వంట గ్యాస్ పంపిణీ, రైతుల రుణమాఫీ, రైతు భరోసా, తదితర పథకాలను అమలు చేస్తున్నది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఉద్యోగాల భర్తీ, బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులు చేస్తున్నా.. జరుగుతున్నా.. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య అరోపనలను తిప్పికొట్టాడంలో, బిఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో జరిగిన దోపిడీ తెలంగాణ రాష్ట్రానికి చేసిన తీరని అన్యాయాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని వివరించడంలో, కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమ అభివృద్ధి పట్ల ప్రజలకు విడమర్చి చెప్పడంలో విఫలం కాకుండా సంస్థాగతంగా నాయకులకు అవగాహన కల్పిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థులను వినిపించేలా కార్యకర్తలు సంసిద్ధంగా ఉన్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కస్టర్ సభ్యులు బూసమోని యాదయ్య, బండ వేణుగోపాల్, బొక్క సంజీవరెడ్డి, పాండు, ప్రభాకర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్త పడ్డ మణికొండ ఆర్టిఏ అధికారులు




**రంగారెడ్డి జిల్లా మహా:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిఏ కార్యాలయాలో ఎసిబి అధికారుల దాడులతో అప్రమత్తమైన మణికొండ ఆర్టిఏ అధికారులు, కార్యాలయ ఆవరణంలో మధ్యవర్తులను, వాహన దారులు అశ్రయించరాదు అనే సూచిక బోర్డును ఏర్పటు చేసి తలుపు మూసివేశారు. మణికొండ ఆర్టిఏ సిబ్బంది కార్యాలయం తలుపులు మూసివేయడంతో, కార్యాలయంలో వాహనదారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఆర్టిఏ అధికారులు మధ్యవర్తులను అటు పక్కకు రాకుండా జాగ్రత్త పడ్డారు.


# ఫరూక్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికకు ఇంటింటి ప్రచారం



**షాద్ నగర్, మహా:** ఫరూక్‌నగర్ మండలంలోని ఎస్సీ వాడ, అంబేద్కర్ కాలనీలలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ మండల విద్యాధికారి మనోహర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మనోహర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు, ఉచిత పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులు, ప్రోటీన్‌తో కూడిన మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. అదేవిధంగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కాలనీ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ నాగమణి, ఉపాధ్యాయులు జయశ్రీ, లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 2025-26 భూపాలపల్లి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక రూ.2920.33 కోట్లు

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**




**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా 2025 26 జిల్లా వార్షిక రుణ ప్రణాళిక 2920.33 కోట్లను ఆమోదించి, వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రతి సెక్టార్ కు నిర్దేశించిన లక్ష్యం మేర బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ (DCC) మరియు జిల్లా స్థాయి రివ్యూ కమిటీ (DLRC) సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలోని బ్యాంకులు రుణాలు లావాదేవీలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు మరియు వార్షిక క్రెడిట్ ప్లాన్ 202425 ప్రకారం మార్చి 31 నాటికి బ్యాంకుల ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 202425 ఆర్థిక సంవత్సరం మొత్తం రుణాలు లక్ష్యాన్ని రూ.2565.06 కోట్లుగా నిర్ణయించగా, రూ.1923.32 కోట్లు సాధించడం ద్వారా 74.98 శాతం పురోగతి సాధించారని వివరించారు. వ్యవసాయ రంగంలో రూ.2055.42 కోట్ల లక్ష్యంతో పోలిస్తే రూ.1219.48 కోట్లు మంజూరు చేసి 59.33 శాతం పురోగతి సాధించారని తెలిపారు. షార్ట్ టర్మ్ క్రాప్ రుణాలు 1344.57 కోట్లు కాగా 660.10 కోట్లు లక్ష్యం సాధించారని తెలిపారు. ఎం ఎస్ ఎం ఈరంగంలో 96.73 కోట్లు రుణాలు మంజూరు లక్ష్యం కాగా 60.77 కోట్లు రుణాలు ఇచ్చారని, విద్యా రుణాలు 18.01 కోట్లు లక్ష్యం కాగా 7.23 కోట్లు రుణాలు ఇచ్చారని అన్నారు. గృహ నిర్మాణ రుణాలు 52.76 కోట్లు లక్ష్యం కాగా 3.14 కోట్లు మాత్రమే ఇచ్చారని రుణాలు మంజూరు పురోగతి తో వెనుకబాటులో ఉన్నదని లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఇతర ప్రాధాన్యతా రంగాలకు 12.37 కోట్లు రుణాలు 38.48 కోట్లు రుణాలు మంజూరు చేసారని, అలాగే ప్రాధాన్యత రంగాలకు కూడా నిర్దేశించిన లక్ష్యం మేర రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. నాన్ ప్రైయారిటీ రంగంలో రూ.330.77 కోట్ల లక్ష్యంతో పోలిస్తే రూ.594.22 కోట్లు మంజూరు చేయడం ద్వారా 179.65 శాతం పురోగతి సాధించారని అన్నారు. బ్యాంకర్లు వ్యవసాయ, విద్యా, గృహ రుణాలు. మంజూరు చేయాలని, గ్రామీణాభివృద్ధికి మరింత కృషి చేయాలని, ముఖ్యంగా హౌసింగ్ లోన్లు, విద్యా లోన్లలో పురోగతి పెంచాలని సూచించారు.

# రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలోకి రాష్ట్ర ముఖ్యమంత్రికి క్షీరాభిషేకం..



**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం శేఖర్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్ మాట్లాడుతూ రైతులకు ఆసరా రైతు భరోసా నిధులను రైతులు ఖాతాలో వేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తు రైతులకు అండగా నిలిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్రలో భాగంగా చెప్పిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం ఒకటి ఒకటి నెరవేరుస్తున్నారు. స్థానిక సంస్థ ఎన్నికలలో రైతులు కాంగ్రెస్ పార్టీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధిలో భాగం పంచుకోవాలన్నారు. ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. రైతులకు భరోసా నిధులను సరైన సమయంలో వేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మైలారం సులోచన, సంజయ్ యాదవ్, బెబ్బిలి కృష్ణయ్య, అశోక్, జగన్, ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

- మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి: డిసిపి రాజేష్
- విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ...




**రాజేంద్రనగర్ మహా ;** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం శంషాబాద్, రాజేంద్రనగర్, అత్తాపూర్ సిఐల ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లో పరిధిలో కళాశాలలో విద్యార్థులతో కలిసి పోలీసులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలిస్తాం, డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిస్తామని విద్యార్థులతో కలిసి పోలీసులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటుపడి యువత తమ మేధాశక్తిని వృథా చేసుకోకూడదన్నారు. డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గంజా యి, డ్రగ్స్ వినియోగాన్ని యువత స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకుంటుంది దీనిద్వారా విలువైన జీవితాన్ని నష్టపోతారని ఆయన అన్నారు. మత్తు పదార్థాలు వాడటం వల్ల శరీరంలోని కొన్ని అవయవాలు పనిచేయకుండా పోతాయి. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల సహనం కోల్పోయి ఇతరులపై దాడులు, హత్యలు, దొంగతనాలాంటి నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సూచించిన మార్గాన్ని పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. స్కూళ్లు, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ తీసుకుంటున్నా విక్రయిస్తున్నా పోలీసులకు 1098 నెంబర్ కి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, ఏసిపి శ్రీకాంత్ గౌడ్, ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్, ఎస్సై అర్షద్ అలీ, పోలీస్ సిబ్బంది కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# 1.41 కోట్ల మంది విమానమెక్కారు..

దేశీ విమానయాన రంగంలో ప్రయాణికుల సంఖ్య మే నెలలో 1.89 శాతం పెరిగి 1.41 కోట్లకు చేరినట్టు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ప్రకటించింది. 2024 మే నెలలో విమాన ప్రయాణికుల సంఖ్య 1.38 కోట్లుగా ఉంది. 64 శాతం మార్కెట్ వాటా ఇండిగో చేతుల్లోనే ఉంది. ఈ సంస్థ విమానాల్లో 93.09 లక్షల మంది ప్రయాణించారు. ఆ తర్వాత 37.22 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించడం ద్వారా 26.5 శాతం మార్కెట్ వాటా ఎయిర్ ఇండియా గ్రూపు సొంతం చేసుకుంది. ఇక ఆకాశ ఎయిర్ విమానాల్లో 7.48 లక్షల మంది, స్పైస్‌జెట్ విమానాల్లో 3.40 లక్షల మంది చొప్పున మే నెలలో ప్రయాణించారు. ఆకాశ ఎయిర్ మార్కెట్ వాటా 5.3 శాతంగా ఉంటే, స్పైస్ జెట్ మార్కెట్ వాటా 2.4 శాతానికి పరిమితమైంది. ఆరు ప్రధాన విమానాశ్రయాల నుంచి (హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా) 84 శాతం సర్వీసులకు సకాలంలో సేవలు అందించి ఇండిగో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 79.7 శాతంతో ఎయిర్ ఇండియా గ్రూపు ద్వితీయ స్థానంలో ఉంది.



# దేశంలో సంపద.. సంపన్నులు రెట్టింపు


దేశంలో సంపద పెరుగుతోంది. సంపన్నులు రెట్టింపవుతున్నారు. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) తాజా నివేదిక ప్రకారం.. 20242029 మధ్య అంటే ఐదేళ్లలో మిలియనీర్ల జనాభా 55 శాతానికిపైగా పెరుగుతుందని అంచనా. ఇది ప్రపంచ సగటు 21 శాతం కంటే రెట్టింపు. 20232024 మధ్య కాలంలో భారత ఆర్థిక సంపద 10.8 శాతం పెరిగిందని, ఆసియాపసిఫిక్ (ఏపీఏసీ) సగటు 7.3 శాతం దాటిందని బీసీజీ తెలిపింది. ఉత్తర అమెరికా (4%), పశ్చిమ ఐరోపా (5%) లను మించి ఎఆసియాపసిఫిక్ ప్రాంతం 2029 నాటికి వార్షికంగా 9% వృద్ధి చెందుతుందని అంచనా వేసింది. 2024 నుంచి 2029 వరకు డాలర్ మిలియనీర్ల సంఖ్య 55 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా వేస్తున్నామని బీసీజీ మేనేజింగ్ డైరెక్టర్, పార్టనర్ మయాంక్ ఝా తెలిపారు. తొలితరం మొదటిసారి సంపద సృష్టికర్తలు, ముఖ్యంగా మిలీనియల్ (యువ) పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ లీడర్లు పరిశ్రమను పునర్నిస్తున్నారని పేర్కొన్నారు. బలమైన ఈక్విటీ మార్కెట్ పనితీరు కారణంగా ఆర్థిక ఆస్తులు 8.1% పెరగడంతో 2024లో ఆర్థిక సంపద రికార్డు స్థాయిలో 305 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందని బీసీజీ గ్లోబల్ నివేదిక తెలిపింది. విలువైన క్లయింట్ల గుర్తింపు, ప్రాధాన్యంలో సంస్థలకు సహకారం అందిస్తూ ఉత్పాదక ఏఐ (GenAI) సంపద ముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేస్తుందని వివరించింది. ఈ ఉత్పాదక ఏఐని త్వరగా అందిపుచ్చుకున్నవారు ఐదు రెట్లు అధికంగా పురోగమిస్తున్నారని వివరించింది.

# బంగారం కంటే వెండి ముద్దు



విలువైన లోహంలో ఒకటిగా ఉన్న బంగారం ధరలు ఇటీవల కాలంలో 10 గ్రాములు రూ.1లక్షకుపైగా చేరింది. ఇంకోవైపు మరో విలువైన లోహం వెండి కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ఇజ్రాయెల్-ఇరాన్ ఘర్షణలు, రష్యాఉక్రెయిన్ భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో వీటి ధరలు ఆకాశాన్నంటినట్లు కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బంగారం, వెండిలో పెట్టుబడిపెట్టే వారికి రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి సూచనలు చేశారు. ఇప్పటికే బంగారం భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత సమయంలో పుత్తడి కంటే వెండిపై పెట్టుబడి పెడితే దీర్ఘకాలంలో మంచి రాబడి పొందవచ్చని కియోసాకి తెలిపారు. బంగారంతోపాటు బిట్‌కాయిన్ ధరలు పెరిగిన తరుణంలో అవి కాస్త తగ్గుముఖం పట్టిన తర్వాతే వాటిని కొనుగోలు చేస్తానని కియోసాకి తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. బంగారం, బిట్‌కాయిన్ ధరలు ఎప్పుడు పడుతాయోనని వేచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునేముందు సొంతంగా రిసెర్చ్ చేసి ఇన్వెస్ట్ చేయాలని చెప్పారు.

ఆర్థిక అంశాల్లో ఎప్పటికప్పుడు తన అంచనాలను వెల్లడించే రాబర్ట్ కియోసాకి ఇటీవల వెండి గురించి ఇటీవల సంచలన అభిప్రాయం ప్రకటించారు. కిలో వెండి ధర రూ.2 లక్షలకు చేరొచ్చని అభిప్రాయపడ్డారు. ఆర్థిక అస్థిరత, స్థిరమైన ఆస్తులకు పెరుగుతున్న డిమాండ్ గురించి ప్రస్తావిస్తూ కియోసాకి వెండిని దాని పారిశ్రామిక ఉపయోగం, ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా రక్షణ కవచంగా ఉదహరిస్తూ 'నేడు ప్రపంచంలోనే భలే మంచి బేరం' అని అభివర్ణించారు.




# సగం ధరకే మలేరియా వ్యాక్సిన్.. ప్రకటించిన భారత్ బయోటెక్ చైర్మన్..!


ప్రపంచంలోనే తొలి పిల్లల మలేరియా వ్యాక్సిన్ తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకురానున్నట్లు భారత్ బయోటెక్ ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన ఫార్మా దిగ్గజం 2028 నాటికి వ్యాక్సిన్ ధరను సగానికి పైగా తగ్గిస్తామని ప్రకటించింది. దాంతో వ్యాక్సిన్ రూ. 429కే అందుబాటులోకి రానున్నది. భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్, జీఎస్‌కే పీఎల్‌సీ తాము అభివృద్ధి చేస్తున్న ఆర్‌టీఎస్ఎస్ వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని ప్రకటించాయి. గతంలో వ్యాక్సిన్ ధర రూ.859కు అందుబాటులో ఉండేది. ప్రస్తుతం ధర కనీసం 60శాతం తగ్గనున్నది. రెండు కంపెనీలు వ్యాక్సిన్ల తయారీ ప్రక్రియను మెరుగుపరచడంతో పాటు ఉత్పత్తి సామర్థ్యాన్ని విస్తరించడం, ఖర్చులను తగ్గించుకొని తక్కువ లాభాల ద్వారా వ్యాక్సిన్‌ను 2028 నాటికి వ్యాక్సిన్‌ను తగ్గిస్తామని రెండు కంపెనీలు ప్రకటించాయి. ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా ఆఫ్రికా, భారత్ వంటి ప్రభావిత దేశాల్లో పిల్లలకు మలేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ వ్యాక్సిన్లు వేయనున్నారు. వాస్తవానికి ఏటా ఐదులక్షల మందికిపైగా పిల్లలు మలేరియా బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ఆఫ్రికాలో పిల్లలకు తక్కువ ధరకే మలేరియా వ్యాక్సిన్లు అందించేందుకు వ్యాక్సిన్ అలయన్స్ (గ్లాక్సోస్మిత్‌క్లైన్) గవి అనే స్వచ్ఛంద సంస్థ పని చేస్తోంది. ఈ సంస్థకు జీఎస్‌కే వ్యాక్సిన్లు సరఫరా చేస్తూ వస్తున్నది. ఈ సందర్భంగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా మాట్లాడుతూ.. జీఎస్‌కే, పాత్ తదితర ఫార్మా కంపెనీలు కలిసి ఆర్‌టీఎస్ఎస్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఈ వ్యాక్సిన్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదం లభించిందని.. జేఎస్‌కే ఈ వ్యాక్సిన్ టెక్నాలజీని భారత్ బయోటెక్‌కు బదిలీ చేసిందని చెప్పారు. వ్యాక్సిన్‌ను తయారు చేసేందుకు గవికి సరఫరా చేసేందుకు 2021లోనే ఒప్పందం కుదిరిందన్నారు. వ్యాక్సిన్ల తయారీ, అభివృద్ధి కోసం భారత్ బయోటెక్ 200 మిలియన్ల పెట్టుబడి పెట్టిందన్నారు. చారిత్రాత్మక ప్రకటన ద్వారా కోట్లాది మంది పిల్లలు, కుటుంబాలను మలేరియా భూతం నుంచి కాపాడబోతున్నామన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ప్రక్రియ మెరుగుదలలు, చౌకైన తయారీ పద్ధతులు, కనీస లాభ విధానం ద్వారా ఈ ధర తగ్గింపు సాధ్యమైంది. మలేరియాను ఎదుర్కోవడానికి శాశ్వత పరిష్కారాన్ని కనుగొనడానికి 2021 నుంచి భారత్ బయోటెక్‌తో కలిసి పనిచేస్తున్నామని జీఎస్‌కే చీఫ్ గ్లోబల్ హెల్త్ ఆఫీసర్ థామస్ బ్రూయర్ అన్నారు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL





# దటీజ్ భారత్.. అందుకే సంతకానికి రాజ్‌నాథ్ నిరాకరణ

**2025 జూన్ 26న చైనాలో జరిగిన షాంఘై సహకార సంస్థ (SCO) రక్షణ మంత్రుల సమావేశంలో భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో ఉమ్మడి ప్రకటన పత్రంపై సంతకం చేయడాన్ని ఆయన నిరాకరించారు.**

**బీజింగ్/న్యూఢిల్లీ:** చైనా పర్యటనలో ఉన్న భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పహల్గాం ఉగ్రదాడి, సీమాంతర ఉగ్రవాదం గురించి ఆయన కీలక ప్రసంగం చేశారు. అనంతరం సమావేశానికి సంబంధించిన జాయింట్ డాక్యుమెంట్‌ను ఆయన ముందు ఉంచారు. అయితే.. అందులో పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడంతో ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ నిరాకరించారు. దీంతో సంయుక్త ప్రకటనను రద్దు చేయాల్సి వచ్చింది.

**ఎందుకంటే..**

చైనాలోని క్వింగ్డావోలో షాంఘై సహకార సంస్థ సభ్య దేశాల రక్షణ మంత్రిత్వస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు చైనా అధ్యక్షత వహిస్తోంది. ఇందులో ఆతిథ్య దేశంతో పాటు భారత్, పాకిస్థాన్‌తో పాటు 10 సభ్య దేశాల రక్షణ మంత్రులు పాల్గొన్నారు. బెలారస్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, రష్యా, తజకిస్థాన్, ఉజ్బెకిస్థాన్ ఈ ఆర్గనైజేషన్‌లో సభ్య దేశాలుగా ఉన్నాయి. సదస్సు అనంతరం రూపొందించిన జాయింట్ డాక్యుమెంట్.. జమ్మూకశ్మీర్‌లో చోటుచేసుకున్న పహల్గాం ఉగ్రదాడి ఘటనను అందులో ప్రస్తావించలేదు. అదే సమయంలో బలోచిస్థాన్ అంశాన్ని చేర్చి భారత్‌ను నిందించే ప్రయత్నం జరిగింది. దీంతో ఉగ్రవాదంపై భారత వైఖరిని నీరుగార్చేలా ఉన్న ఆ పత్రంపై సంతకం చేసేందుకు రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించారు. ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంతో రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను ఆర్గనైజేషన్ రద్దు చేసింది. అయితే.. పాకిస్థాన్ వల్లే చైనా ఈ జాయింట్ డాక్యుమెంట్ నుంచి పహల్గాం ప్రస్తావనను మినహాయించి ఉంటుందనే సంకేతాలు కన్పిస్తున్నాయి. అంతకుముందు ఎస్‌సీవో సదస్సులో రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. కొన్ని దేశాలు సీమాంతర ఉగ్రవాద విధానాన్ని సాధనంగా వాడుకుంటున్నాయని పరోక్షంగా దాయాది పాక్‌ను దుయ్యబట్టారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ రక్షణమంత్రులు ఎదురుపడటం ఇదే తొలిసారి. అయితే, ఈ సదస్సులో వీరిద్దరి మధ్య ఎలాంటి పలకరింపులు జరగలేదని సమాచారం. 2020లో గల్వార్ ఘర్షణ తర్వాత నుంచి భారత రక్షణ మంత్రి చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.





# ఇరాన్ ప్రజల ఆందోళన.. ఖమేనీ ఎక్కడ?

టెహ్రాన్: ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య భీకర దాడులు కొనసాగాయి. ఇదే సమయంలో ఇరాన్‌పై అమెరికా సైతం ఆకస్మిక దాడులకు దిగింది. దీంతో, మూడో ప్రపంచ యుద్ధం జరుగుతోందా? అన్న భయాందోళన నెలకొంది. కానీ, అనూహ్య పరిణామాలతో యుద్ధ వాతావరణం సద్దుమణిగింది. అయితే, వారం రోజులుగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఇప్పటి వరకు కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక, ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య యుద్ధం ప్రారంభమైన తర్వాత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అదృశ్యమయ్యారు. వారం రోజులుగా ఖమేనీ బహిరంగంగా ఎక్కడా కనిపించలేదు. యుద్ధం కొనసాగుతున్న సమయంలో కూడా ఖమేనీ వాయిస్ కూడా బయటకు వినిపించలేదు. దీంతో ఇరాన్ నేతలు, ప్రజలు ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా తీవ్రమైన ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే, యుద్ధం ప్రారంభం తర్వాత సుప్రీం లీడర్ ఖమేనీని రహస్య భూగర్భ బంకర్‌కు తరలించారని వార్తలు బయటకు వచ్చాయి. ఆయనను ఎవరూ టార్గెట్ చేయకుండా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్‌కు దూరంగా ఉంచినట్టు సన్నిహిత అధికారులు చెబుతున్నారు. ఇరాన్ ప్రభుత్వ అగ్రశ్రేణి వ్యక్తులకు కూడా ఆయనతో ప్రత్యక్ష సంబంధం తెగిపోయినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. మంగళవారం ప్రైమ్‌టైమ్ ఇరాన్ స్టేట్ టెలివిజన్ షో హోస్ట్ ఖమేనీ కార్యాలయంలో సీనియర్ అధికారి మెహదీ ఫజేలీని సుప్రీం లీడర్ ఆచూకీ గురించి అడిగారు. ఈ సందర్భంగా ప్రజలు సుప్రీం లీడర్ గురించి చాలా ఆందోళన చెందుతున్నారు. ఆయన ఎలా ఉన్నారో మాకు చెప్పగలరా? అని ప్రశ్నించారు.

కానీ ఫజేలీ.. మాత్రం ఆ ప్రశ్నను పక్కనపెట్టి మనమందరం ప్రార్థన చేయాలి. సుప్రీం లీడర్‌ను రక్షించే పనిలో ఉన్నవారు తమ పనిని చేస్తున్నారు అని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. దశాబ్దాలుగా ఇరాన్‌ను మకుటం లేని మహారాజులా ఏలుతున్న 86 ఏళ్ల ఖమేనీ కోసం ఇజ్రాయెల్ నిఘా వర్గాలు వేట సాగిస్తున్నాయి. ఆయనకు విదేశాల్లోనే కాదు, సొంత దేశంలోనూ శత్రువులున్నారు. ఖమేనీ ఆచూకీ దొరికితే సజీవంగా బంధించి, చట్టప్రకారం శిక్షించడమో లేక అక్కడికక్కడే అంతం చేయడమో తథ్యమని పశ్చిమ దేశాల మీడియా అంచనా వేస్తోంది. ఇరాన్‌లో తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించాలంటే ఆయన ప్రాణాలతో ఉండడానికి వీల్లేదని ఇజ్రాయెల్, అమెరికా నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఖమేనీ భౌతికంగా లేకుండాపోతేనే ఈ యుద్ధం ముగుస్తుందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేయడం గమనార్హం. ఖమేనీ ఆధునిక హిట్లర్. అతడు బతికి ఉండడానికి వీల్లేదని కూడా సంచలన వ్యాఖ్యలు చేశారు.



# మహా విషాదం...

## స్కూల్లో తొక్కిసలాట.. 26 మంది విద్యార్థులు మృతి

**బంగుయ్:** సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ రాజధాని బంగుయ్‌లోని బార్తెలెమీ బోగాండా హై స్కూల్‌లో గురువారం (జూన్ 26)న ఘోర ప్రమాదం జరిగింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరించే సమయంలో ఒక భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు కారణంగా విద్యార్థులు భయంతో పరుగులు తీయగా, తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ దుర్ఘటనలో 29 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 260 మందికి పైగా గాయపడ్డారు. బాధితుల్లో 16 మంది బాలికలు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సుమారు 5,000 మంది విద్యార్థులు పరీక్షల కోసం అక్కడ ఉన్నారు. ఈ ఘటనపై ఆ దేశ విద్యా మంత్రిత్వ శాఖ విచారణ ప్రారంభించింది. గాయపడిన విద్యార్థుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ దుర్ఘటన ఆ దేశ విద్యా చరిత్రలో ఒక విషాదకరమైన సంఘటనగా నిలిచింది.

# మీరు భారతీయుడిలా కాదు.. పాకిస్తానీలా కనిపిస్తున్నారు: కంగనా

**న్యూఢిల్లీ:** న్యూయార్క్ మేయర్ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీపై బీజేపీ ఎంపీ, ప్రముఖ నటి కంగనా రనౌత్ ఘాటు విమర్శలు చేశారు. డెమొక్రటిక్ ప్రైమరీ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన మమ్దానీ గెలుపొందిన తర్వాత అటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విమర్శలు గుప్పించగా, కంగనా రనౌత్ సైతం అతని గెలుపును ఉద్దేశిస్తూ మండిపడ్డారు. తన సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్' ద్వారా మమ్దానీ భారతీయుడి కంటే పాకిస్తానీగానే ఎక్కువగా కనిపిస్తున్నాడని ఆరోపించారు కంగనా. @మమ్దానీ తల్లి మీరా నాయర్.. భారత అత్యుత్తమ చిత్ర నిర్మాణ రంగానికి కృషి చేసి పేరు సంపాదించారు. పద్మశ్రీ కూడా గెలుచుకున్నారు. ఆమె న్యూయార్క్‌లో ఉన్నప్పటికీ భారత్‌లో పుట్టి పెరిగారు. గుజరాత్‌కు చెందిన మెహ్మద్ మమ్దానీని మ్యారేజ్ చేసుకుని న్యూయార్క్‌లో సెటిల్ అయ్యారు. మెహ్మద్ మమ్దానీకి కూడా రచయితగా మంచి గుర్తింపు ఉంది. మరి జోహ్రాన్ మమ్దనీ మాత్రం పాకిస్తానీ లాగా కనిపిస్తున్నాడు. భారత మూలాలు ఎక్కడ కనిపించడం లేదు. అతని భారత మూలాల్లో జరిగిందేదో జరిగింది. కానీ మమ్దానీ మాత్రం యాంటీ ఇండియన్ కాబోతున్నాడు' అని కంగనా రనౌత్ రాసుకొచ్చారు. కాగా, 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ డెమొక్రాటిక్ మేయర్ ఎన్నికల్లో విజయం సాధించి రేసులో నిలిచాడు. ఉగాండాలో భారతీయ మూలాలున్న కుటుంబంలో జన్మించారు. తండ్రి ప్రొఫెసర్ మహ్మూద్ మమ్దానీ, తల్లి ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్. భార్య సిరియా మోడల్ రమా దువాజీ. రాజకీయ నాయకుడిగా, సామాజిక కార్యకర్తగా న్యూయార్క్ మేయర్ రేసు ప్రచారంలో తొలి నుంచి.. ఉచిత బస్సు ప్రయాణం హామీతో బాగా పాపులారిటీ సంపాదించుకున్నాడు. అలాగే పిల్లల సంరక్షణ, సంపన్నులపై అధిక పన్నులు లాంటి హామీలతో ప్రచారంలో ఏడాదిగా దూసుకుపోతున్నాడు. అలెగ్జాండ్రియా ఒకాసియోకార్టెజ్, బెర్నీ సాండర్స్ వంటి ప్రముఖులు ఇతనికి మద్దతుగా నిలిచారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 27-06-2025

## మాజీ ప్రియుడి బర్త్ డే.. స్పెషల్‌గా విష్ చేసిన బాలీవుడ్ భామ!

బాలీవుడ్ భామ మలైకా అరోరా పేరు చెప్పగానే ఐటమ్ సాంగ్స్ గుర్తొస్తాయి. ఆ తర్వాత ఆమె డేటింగ్ వ్యవహారం గుర్తొస్తుంది. ఎందుకంటే హీరో సల్మాన్ ఖాన్ తమ్ముడు అర్బాజ్ ఖాన్ పెళ్లి చేసుకున్న ఈమె.. దాదాపు 19 ఏళ్ల తర్వాత విడాకులు తీసుకుంది. ఆ తర్వాత కొన్నేళ్లకు తన కంటే చిన్నవాడైన అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం నడిపించింది. అయితే వీరి ప్రేమబంధం ఎక్కువ రోజులు నిలవలేదు. దాదాపు ఆరేళ్ల డేటింగ్ అనంతరం బ్రేకప్ చెప్పేసుకుని అభిమానులకు షాకిచ్చారు. అయితే కొన్నినెలల క్రితం ఐపీఎల్ మ్యాచ్‌లో శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర పక్కన మలైకా కనిపించడంతో వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారా? అంటూ రూమర్స్ వినిపించాయి. అయితే దీనిపై ఎవరూ కూడా స్పందించలేదు. తాజాగా తన మాజీ భాయ్ ఫ్రెండ్ అర్జున్ కపూర్ బర్త్ డే కావడంతో విషెస్ తెలిపింది ముద్దుగుమ్మ. ఈ మేరకు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. హ్యాపీ బర్త్‌డే, అర్జున్ కపూర్' మాజీ ప్రియుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. ప్రస్తుతం ఒంటరిగానే ఉంటోన్న మలైకా అరోరా మాజీ లవర్‌కు విషెస్ చెప్పడంపై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అయితే గతేడాది బ్రేకప్ చెప్పకున్న ఈ జంట మాత్రం సోషల్ మీడియాలో ఫ్రెండ్‌షిప్ కొనసాగిస్తూనే ఉన్నారు. కాగా.. అర్జున్ కపూర్ ఇటీవలే తెరపైకి వచ్చిన 'మేరే హస్బెండ్ కి బివి' అనే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం 'నో ఎంట్రీ 2' అనే మూవీలో నటించనున్నారు.



## అభిమానులకు రష్మిక బంపరాఫర్
### నా కొత్త సినిమా టైటిల్ ఎంటో చెబితే మిమ్మల్ని కలుస్తా.!

నేషనల్ క్రష్ టాలీవుడ్ నటి రష్మిక మందన్నా తమ అభిమానులకు బంపరాఫర్ ప్రకటించింది. తన కొత్త సినిమా టైటిల్‌ను సరిగ్గా చెబితే తానే అభిమానులను స్వయంగా కలుస్తానని రష్మిక మందన ప్రకటించింది. ఈ సినిమాకు సంబంధించిన ఒక పోస్టర్‌ను విడుదల చేస్తూ ఈ విషయాన్ని పంచుకుంది ఈ భామ. ఈ పోస్టర్ చూస్తే.. రష్మిక ఇందులో వారియర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. పిరీయాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. అన్‌ఫార్ములా బ్యానర్‌పై ఈ సినిమా రాబోతుంది. ఇటీవల కుబేరా సినిమాతో మరో బ్లాక్ బస్టర్ అందుకుంది ఈ భామ. ఛావాతో ఇప్పటికే ఈ ఏడాది సూపర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్న ఈ అమ్మడు కుబేరతో మరో హిట్‌ను అందుకుంది.





## ఇలాంటి సినిమాలు విజయం సాధించాలి: మురళీ మోహన్


"డొక్కా సీతమ్మగారిలాంటి గొప్పవారిపై సినిమా తీస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడంతా కమర్షియల్ అయిపోయిన సమయంలో రాంబాబు, రవి నారాయణగారు 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' చిత్రం నిర్మిస్తుండటం అభినందనీయం. ఇలాంటి సినిమాలు పెద్ద విజయాన్ని సాధించాలి" అని మురళీమోహన్ తెలిపారు. టీవీ రవి నారాయణ్ దర్శకత్వంలో మురళీమోహన్, ఆమని ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'. వల్లూరి రాంబాబు, మట్టా శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. జూన్ 24న మురళీమోహన్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ని విడుదల చేశారు. టీవీ రవి నారాయణ్ మాట్లాడుతూ– "ఈ సినిమా ఆరంభం నుంచి మురళీమోహన్‌గారు ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇక్కడివరకూ వచ్చింది" అన్నారు. అతిథిగా హాజరైన డైరెక్టర్ రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– "డొక్కా సీతమ్మగారి' కథతో సినిమా తీస్తుండటం ఆనందంగా ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కార్తీక్, నిర్మాతలు సాయివెంకట్, రామ సత్యనారాయణ, బెక్కెం వేణుగోపాల్, డైరెక్టర్ శివ నాగు, దాసన్న తదితరులు మాట్లాడారు.

## ఒకే వేదికపై సందడి చేయనున్న విజయ్ దేవరకొండ, రామ్ చరణ్

టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రామ్ చరణ్ ఒకే వేదికపై సందడి చేయనున్నారు. డ్రగ్స్ వ్యతిరేకంగా ఈ నటులు తమ గొంతు కలుపనున్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ ప్రత్యేక అతిథులుగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమం జూన్ 27న, సాయంత్రం 4 గంటలకు శిల్పకళా వేదికలో జరగనుంది. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణ, వాటి దుష్ప్రభావాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ప్రముఖ సినీ తారలు హాజరుకావడం ద్వారా ఈ సందేశం మరింత మందికి చేరుతుందని భావిస్తున్నారు.







## శ్రీలీల ప్లేస్‌లో భాగ్యశ్రీ భోర్సే..!

టాలీవుడ్ యువ హీరో అక్కినేని వారసుడు అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా, అఖిల్ సొంత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టైటిల్ గ్లింప్స్ గ్రామీణ నేపథ్యంలో ఆకట్టుకుంది. అయితే, ఈ సినిమా నుంచి శ్రీలీల తప్పకున్నట్లు వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. హిందీ, తమిళ సినిమాల కోసం డేట్స్ కేటాయించడం కష్టంగా మారడంతో ఈ ప్రాజెక్ట్ నుంచి శ్రీలీల తప్పకోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి కొత్త కథానాయిక పేరు వినిపిస్తుంది. మిస్టర్ బచ్చన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన భామ భాగ్యశ్రీ భోర్సే లెనిన్ సినిమాలో కథానాయికగా నటించబోతున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com





# కంది శ్రీనివాస రెడ్డి నివాసాన్ని సందర్శించిన జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు

**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ, ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కష్ణారావు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నివాసాన్ని సందర్శించారు. పర్యటనలో భాగంగా తలమడుగు మండలంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కంది శ్రీనివాస రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన స్వస్థలం తాంసి మండలం హస్నాపూర్ గ్రామంలోని ఆయన నివాసాన్ని సందర్శించారు. కంది శ్రీనివాస రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు గ్రామస్తులు మంత్రికి ఘన స్వాగతం పలికారు.తేనీటి విందు ను స్వీకరించారు.

## పది సంవత్సరాల్లో నియోజకవర్గం వెనుకబడింది

- 27, 28 ప్యాకేజీలు పూర్తి చేసి సాగు నీరు అందించండి
- బాసర ఆలయానికి వెనక్కి మళ్లిన నిధులు ఇవ్వండి
- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్




**మహా, నిర్మల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గం గత పది సంవత్సరాల్లో ఎంతో వెనుకబడిందని, అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కోరారు. అదిలాబాదులో గురువారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరి వల్ల బాసర ఆలయానికి కేటాయించిన 43 కోట్ల రూపాయల నిధులు వెనక్కి మళ్లాయని, గోదావరి పుష్కరాలు సమీపిస్తున్నందుకు తక్షణం నిధులు ఇచ్చి ఆలయ పునర్నిర్మానం చేపట్టాలన్నారు. 27, 28 కాలేశ్వరం ప్రాణహిత ప్యాకేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటికి నిధులు ఇస్తే వేలాది ఎకరాల్లో సాగునీరు అంది నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందన్నారు. అదేవిధంగా అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. పేద ప్రజలున్న ముధోల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ పథకం కింద ఎక్కువగా ఇండ్లు కేటాయించాలన్నారు. పోడు భూముల్లో సాగు చేస్తున్న రైతులకు ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. లోకేశ్వరం మండలంలో అర్లి బ్రిడ్జి వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలన్నారు. వంతెన నిర్మాణానికి నిధులు ఇచ్చి సమస్యను తీర్చాలన్నారు.



## మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ఆదిలాబాద్, మహా:** మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని.. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి సంక్షేమ ఫలాలను అందించినపుడే ఆశయం సిద్ధిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనారిటీ సంక్షేమ వసతి గృహం ఆవరణలో రూ.కోటి 40 లక్షలతో నిర్మించిన మైనారిటీ కామన్ సర్వీస్ సెంటర్ ను గురువారం మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు మైనారిటీ గురుకుల విద్యార్థులు అతిథులకు బ్యాండు వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వసతులను సద్వినియోగం చేసుకొని పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మబొజ్జుపటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్శి షా, మైనారిటీ సంక్షేమాధికారి మనోహర్ రావు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారితదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పథకాలు అమలు
- రైతు భరోసా కింద రూ.9వేల కోట్లు ఖాతాల్లో జమ చేశాం
- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం
- సక్రమంగా అందజేయాల్సిన బాధ్యత అధికారులదే
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష



**ఆదిలాబాద్, మహా:** ప్రజా పాలనలో పారదర్శకతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి. ప్రతి లబ్ధిదారుడికి నిర్ణీత గడువులోగా అందించినప్పుడే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. గురువారం అధికారిక పర్యటన కోసం తొలిసారి ఆదిలాబాద్ కు వచ్చిన వారు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి లబ్ధిదారుడికి సక్రమంగా అందించాలనే తపనతో పనిచేస్తున్నామని చెప్పారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి వంటి పథకాలు సక్రమంగా అమలవుతున్నా రూ.500లకే వంట గ్యాస్ పథకం ఇంకా పూర్తి స్థాయిలో అర్హులకు చేరడం లేదని తెలిపారు. గ్రామ సభలు, మీసేవా కేంద్రాల్లో దరఖాస్తులు తీసుకున్నా.. పొరపాటు ఎక్కడ జరిగిందో అధికారులు సమీక్ష నిర్వహించి ప్రతి ఒక్కరికి అందించేలా కృషి చేయాలని సూచించారు. గతంలో ధరణి ఉన్న సమయంలో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చిన తర్వాత పరిష్కరించే బాధ్యతను అధికారులకు అప్పగించామని చెప్పారు. నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఒకవేళ కాకుంటే ఎందుకు కాలేదో చెప్పాలని తెలిపారు. అధికారికంగా ఒక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి వాటి ద్వారా వినతులు స్వీకరించి.. పరిష్కరించే బాధ్యత తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమస్యలు పరిష్కరిస్తే అధికారులకు కూడా మంచి పేరు వస్తుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందులు పెడుతున్నా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు మాత్రం ఆపడం లేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులకు ప్రతి నెలా రూ.6500కోట్లు వడ్డీలు కడుతున్నామని వివరించారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులను పరిమితితో సంబంధం లేకుండా రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గత పదేళ్లలో నకిలీ విత్తనాలకు సంబంధించి ఎన్ని కేసులు నమోదు చేశారు.. ఎంతమందిపై చర్యలు తీసుకున్నారో వివరాలు అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజలంతా మెచ్చుకునేలా పాలన సాగిస్తామని భరోసా ఇచ్చారు.

**ప్రభుత్వం పట్టుదలతో పనిచేస్తోంది**

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పట్టుదలతో పనిచేస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రిగా జూపల్లి కష్ణారావు రావడం జిల్లా ప్రజల అదృష్టమని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.200కోట్లతో 100 ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. సీఎం రిలీఫ్ ఫండ్ తో పాటు ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం అందించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని అర్హులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే లు ప్రస్తావించిన జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రులు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు గోడం నగేష్, గడ్డం వంశీ, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, వెడ్మబొజ్జు పటేల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, కోవ లక్ష్మీ, పాల్వాయి హరీష్ బాబు, గడ్డం వినోద్, ఆయా జిల్లాల కలెక్టర్లు రాజర్షిషా, అభిలాష అభినవ్, వెంకటేష్ దోత్రె, కుమార్ దీపక్, ఎస్పీలు అఖిల్ మహాజన్, జానకి షర్మిల, క్రాంతిలాల్ పాటిల్, ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## జూలై 2న ఆర్యవైశ్య సంఘం ఎన్నికలలో అధికులు పాల్గొనాలి

**మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు జూలై 2 నాడు మంచిర్యాల ఆర్య వైశ్య భవనంలో నిర్వహిస్తున్నట్లు మంచిర్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 జూలై నాడు ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల స్వీకరించి 3వ తేదీన ఉదయం పది గంటల నుండి 12 గంటల వరకు నామినేషన్ల ఉపసంహారణ, 6వ తేదీన ఉదయం పది గంటల నుండి 1 గంట వరకు పోలింగ్ నిర్వహించడం జరుగుతుంధని అనంతరం సాయంత్రం మూడు గంటలకు ఓట్ల లెక్కింపు తర్వాత అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని పేర్కొన్నారు. మంచిర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సభ్యత్వం తప్పనిసరిగా తీసుకోవాలని వెల్లడించారు. అలాగే ఓటింగ్ లో పాల్గోనని వారు కూడా ఆర్యవైశ్య మహాసభలో సభ్యత్వం ఉండాలని చెప్పారు. ఇప్పటి వరకు ఓటు హక్కుల గలవారు అర్హులని అన్నారు. మిగితా వారికి కూడా ఓటు హక్కు కల్పించేందుకు జూలై 1వ తేదీ వరకు ఆర్యవైశ్యులందరికి ఓటు హక్కు కల్పించడం జరుగుతుంధని వివరించారు. ఈ అవకాశాన్ని మంచిర్యాలలోని ఆర్యవైశ్యులంతా వినియోగించుకోవాలని కోరారు.

## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

**బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్**



**మంచిర్యాల, మహా :** మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దామని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని, సింగరేణి మందమర్రి ఏరియా జీఎం దేవేందర్, ఇతర సింగరేణి అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, యువత, రాజకీయ నాయకులు, మహిళలు, పోలీస్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని అన్నారు. నేడు యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై పురోగతికి, ఉజ్వల భవిష్యత్తుకు స్వయంగా అవరోధాలు సృష్టించుకోరాదని వెల్లడించారు. సమాజం నుండి మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ గంజాయి వంటి మత్తుపదార్థాల అమ్మకం, వాడకంపై కఠినంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. చెడు వ్యసనాల వల్ల యువత ఆరోగ్యాన్ని, భవిష్యత్తును చేజేతుల నాశనం చేసుకోవడమే కాకుండా, చట్టవ్యతిరేక కార్యకలాపాలలో చిక్కుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మత్తు అనే మహమ్మారి నుండి మన యువతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే యాంటీడ్రగ్ కమిటీలకు కానీ, డయల్ 100, 1908 నంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఎస్ఐలు, సింగరేణి పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఎస్ఓ టూ జీఎం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు సింగరేణి పాఠశాల మైదానం నుండి వివిధ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత ప్రతిజ్ఞ చేసి, "యాంటీ డ్రగ్ సోల్జర్స్"గా సంతకాలు చేశారు.

## ఘనంగా ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం ఆస్పరెంట్ అకాడమీ విద్యార్థుల సమక్షంలో స్వర్గీయ ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాదాశి రవీందర్, జిల్లా అధ్యక్షులు ముల్కాల రాజేంద్రప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల కిరణ్ బాబు లు ఘనంగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఛత్రపతి సాహు మహారాజ్ చరిత్రను, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా నాయకులు ముత్యం నిహార్ వర్మ, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దాగం శ్రీనివాస్ మంచిర్యాల పట్టణ నాయకులు కుమ్మరి కృష్ణ చైతన్య మందమర్రి పట్టణ నాయకులు కామాద్రి శ్రావణ్ కుమార్ మరియు ఆస్పరెంట్ అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు యువత కృషి చేయాలి




**మహా, నిర్మల్ ;** నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ వ్యాప్తంగా పలు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బంది మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివరణపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని భైంసా పట్టణ సీఐ గోపీనాథ్ సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నిర్ములనకై పౌరులు, యువత కృషిచేయాలని పిలుపునిచ్చారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి



**ఆదిలాబాద్, మహా:** తలమడుగు మండల కేంద్రంలో రూ. 1.56కోట్లతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా ఇంఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అంతకుముందు ఆవరణలో మొక్కలు నాటి కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో మున్సిపల్ అధికారి, కంప్యూటర్ ఆపరేటర్

**లంచం తీసుకుంటూ చిక్కిన అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్**




**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులు సంచలనం రేపాయి. కాంట్రాక్టర్ నుండి లంచం డిమాండ్ చేసిన అకౌంట్స్ అధికారి రాజ్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ రవికుమార్ లను ఏసీబీ అధికారులు గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. విచారణ పూర్తి చేసిన అనంతరం ఏసీబీ డీఎస్పీ మధు వివరాలను వెల్లడించారు. పట్టణంలో చేసిన రోడ్డు పనులకు సంబంధించిన బిల్లు చెక్కులు ఇవ్వాలంటే రూ. 20వేలు డిమాండ్ చేయగా బాధితుడు బతిమిలాడితే రూ. 5వేలు తగ్గించి రూ.15 వేలకు ఒప్పుకున్నారని తెలిపారు. పెండింగ్ బిల్లు ఇవ్వాలని కోరితే దానికి లంచం డిమాండ్ చేశారని, ఐదు శాతం డిమాండ్ చేసినట్లుగా పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడులు జరిపి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామన్నారు. పట్టుబడిన ఇద్దరిని కరీంనగర్ ఏసీబి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు.



## ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగం చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా లక్షెటిపేటలో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగం చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వైద్యరంగ అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ క్రమంలో లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులకి అవకాశం కల్పించాలి

- అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్
- కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త బిసి కులగణన నిర్వహించాలి




**ఎల్బీనగర్,మహా:** ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త బీసీ కులగణనను నిర్వహించాలని,వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు అవకాశం కల్పించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్ అన్నారు.నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాల్ లో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా యాదవ నాయకులు,కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ యాదవులు సామాజికంగా రాజకీయంగా ఎదగాలని సూచించారు. అదే విధంగా పేద యాదవులను ఆదుకోవాలని అందుకు అనుగుణంగా ముందుకు వెళ్తాం అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో యాదవులు సత్తా చాటాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కుల గణన చేపట్టడం సంతోషంగా ఉందని అన్ని కులాల సంఖ్యను యాదవుల సంఖ్యను ఇంకా విపులంగా తెలుపాలన్నారు.కుల గణనలో యాదవ వర్గానికి అన్యాయం జరిగిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి వర్గం చైర్మన్ ఎమ్మెల్సీ లలో యాదవ వర్గం లేకపోవడం వల్ల యాదవ వర్గానికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు.అంజన్ కుమార్ యాదవ్ కు మంత్రి పథవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.రాబోవు స్థానిక ఎన్నికల్లో అన్ని స్థాయిలలో యాదవులు అవకాశాలు ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి లక్ష్మణ్ యాదవ్,హరిబాబు,శ్రీనివాస్ యాదవ్,రాజేందర్ యాదవ్,చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి మాజీ ఆర్టీఐ కమీషనర్ ఒర్రె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## బహిరంగంగా మద్యం సేవిస్తే కఠిన చర్యలు

**హన్మకొండ మహా;** హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధి లోని వడ్డేపల్లిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై సుబేదారి పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడుల్లో 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్స్పెక్టర్ ఎం. రంజిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఎవరు ప్రవర్తించిన, అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

## ఈతకు వెళ్లి కొట్టుకుపోయిన యువకుడు



**ఆదిలాబాద్, మహా:** జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న వేల అపశ్రుతి చోటు చేసుకుంది. పట్టణంలోని నిషాన్ ఘాట్ వాగు వద్ద చేపలు పట్టేందుకు వెళ్ళిన ఓ యువకుడు వాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన ఘటన బాధిత కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. విషయం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలను ప్రారంభించారు. వివరాల్లోకి వెళ్తే పట్టణానికి చెందిన వికాస్, కృష్ణ జాదవ్, శేఖర్ లు గురువారం నిషాన్ ఘాట్ వద్ద చేపలు పట్టేందుకు వెళ్ళారు. ఈ క్రమంలో వాగు ప్రవాహం ఎక్కువ కావడంతో శేఖర్, వికాస్ ఇద్దరు వాగులో పడిపోయారు. ఇందులో ఆకాష్ కు ఈత రావడంతో తోటి స్నేహితుడిని ఆయన కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. శేఖర్ వాగులో కొట్టుకుపోగా... వికాస్ బయటకు వచ్చాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. వాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన శేఖర్ కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.